ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 7 మే 2024



మళ్లీ జగన్ వస్తే నాశనమే..





అగ్నికి వాయువు తోడైతే ఎలా ఉంటుందో.. అధికారానికి అరాచకం కలిస్తే నేరగాళ్లు ఎంత పేట్రేగిపోతారో.. మొన్నటి వరకూ బిహార్, ఉత్తరప్రదేశ్ గురించి చెప్పుకునేవాళ్లం. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏపీలో ఇలాంటి పరిస్థితి నెలకొందని చెబుతారు. అధికారం అండతో వైసీపీ నేతలు చేసిన దారుణాలు గత ప్రభుత్వాలలో ఎప్పుడూ చూడలేదంటారు. అధికారాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని సెటిల్‌మెంట్లు, దందాలు దౌర్జన్యాలకు తెర లేపారు. వెరశి సీఎం సొంత జిల్లాలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. ఎప్పుడో 20 ఏళ్ల కిందట ముగిసిన ఫ్యాక్షన్ కక్షలకు జగన్ పాలనలో మళ్లీ ఆజ్యం పోశారనే విమర్శ ఉంది.

- 58 నెలల పాలనలో అంతా అరాచకమే
- ప్రశ్నించే వారిని.. తన్నడం, మర్దరు చేయడం, కేసులు పెట్టడం
- పోలీసులనే చితక్కొట్టినా పట్టించుకోని పరిస్థితి
- పులివెందులలో గన్నుల కల్చర్
- ఇష్టారాజ్య లైసెన్సులతో కాల్పులు
- సెటిల్‌మెంట్లు, దందాలతో పేట్రేగిన వైసీపీ
- ఇదీ సొంత జిల్లాలో జగన్ అండ్ కో పాలన

(కడప - ఆంధ్రజ్యోతి): సాధారణంగా సీఎం జిల్లా అంటే ఓ ప్రత్యేకం. స్టేట్‌కు సీఎంరాజు అయినా సొంత జిల్లాకు ఆయన బిడ్డే. ఏ సీఎంకు అయినా సొంత జిల్లాపై మమకారం ఉంటుంది. మన సీఎం జగన్‌కు కూడా సొంత జిల్లా అంటే ప్రేమ పైపైనే. గుండెల్లో లేదని అంటారు. అభివృద్ధితో పాటు శాంతిభద్రతలు సీఎం జిల్లాలో కఠినంగా ఉంటాయంటారు. అయితే స్టేట్‌లో ఎలా ఉన్నాయో సీఎం జిల్లాలోనూ శాంతిభద్రతలు అదుపు తప్పాయి. ఎంతవరకు వెళ్లాయంటే గొడవ చేస్తున్న మూకలను మందలించేందుకు వెళ్లిన ఓ ఇంటెలిజెన్సీ సీఐపై దాడి చేసే పరిస్థితికి వెళ్లారు. జిల్లాలో కొన్ని సంఘటనలు పరిశీలిస్తే..

సంచలనంగా.. నందం సుబ్బయ్య హత్య



ప్రొద్దుటూరు దేశంలోనే బంగారం వ్యాపారంలో రెండో ముంబైగా పేరుగాంచింది. ఇక్కడ ముంబైలో మాఫియాకు ఉండే అవలక్షణాలన్నీ ప్రొద్దుటూరుకు వచ్చాయి. వైసీపీ అధి కారంలోకి రావడం.. ఆ పార్టీ తరపున ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఎన్నిక కావడంతో ఇక్కడ అరాచక శక్తులు పేట్రేగిపోయాయంటారు. వైసీపీ నేతల అక్రమాలు, అవినీతిని ప్రశ్నిస్తే బెదిరించడం, లేదంటే ఎంతటి దారుణాలకైనా తెగబడటమే. ఇందుకు నిదర్శనమే టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, బీసీ నాయకుడు నందం సుబ్బయ్య ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఆయన బామ్మర్ది బంగారురెడ్డి, కిరణ్‌రెడ్డి దందాలపై అటుపత్రికా సమావేశంలో, సోషల్ మీడియా ఎదుట విరుచుకుపడేవారు. అవినీతి అక్రమాలను గుట్టురట్టు చేసేవారు. అయితే నందం సుబ్బయ్య విమర్శలను వైసీపీ గ్యాంగ్ జీర్ణించుకోలేక 2020 డిసెంబరు 29న రామేశ్వరం జగనన్న లే అవుట్ల వద్ద అత్యంత దారుణంగా నరికి చంపారు. అదే రోజు రామేశ్వరంలో జగనన్న లేఅవుట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంది. అప్పట్లో అక్కడ మునిసిపల్ కమిషనర్, చుట్టూ అంతా ఉద్యోగుల ఉన్నారు. ఒక పక్క జగనన్న లేఅవుట్ ప్రారంభోత్సవం జరుగుతుండగా పక్కనే నందం సుబ్బయ్యను పొడిచి చంపారు. సుబ్బయ్య భార్య అపరాజిత ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆయన బామ్మర్ది బంగారు రెడ్డి అప్పటి కమిషనర్ రాధలే కారణమంటూ ఆరోపణలు చేసింది. హంతకులను శిక్షించాలని నారా లోకేశ్ ప్రొద్దుటూరుకు వచ్చి నందం సుబ్బయ్య అంత్యక్రియల్లో పాల్గొనడంతో పాటు ఆందోళన చేశారు.



పులివెందులలో కాల్పుల కలకలం

జగన్ సీఎం అయిన తరువాత పులివెందుల వాసులకు గన్ లైసెన్సులు ఈజీగా దొరికాయి. ఒక విధంగా చెప్పాలంటే తిరునాళ్లలో బొమ్మ పిస్తోళ్లలాగా లైసెన్సులు పొందారు. పులివెందుల అంటే జగన్ సొంతూరు. ఆయన తాడేపల్లిలో ఉన్నా ఇక్కడ అంతా ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిలు చక్కబెట్టేవారు. 2019 మార్చి 15న మాజీమంత్రి వివేకానందరెడ్డిని సొంత ఇంటిలోనే గొడ్డలితో కిరాతకంగా హత్య చేశారు. అది ఉమ్మడి స్టేట్‌లోనే సంచలనంగా మారింది. పులివెందుల అంటేనే మరోసారి వార్తల్లోకి వచ్చింది. అయితే గత ఏడాది 2023 మార్చి 28న పులివెందులలో ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరుడుగా చెబుతున్న గొట్టి భరత్‌కు మార్‌యాదవ్ పులివెందులో పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే కాల్పులు జరిపారు. ఈ ఘటనలో పులివెందులకు చెందిన చింతకుంటదిలీప్ స్పాట్‌లో మరణించారు. మట్కా, సెటిల్‌మెంట్లు ఇతర లావాదేవీల కారణంగానే ఈ కాల్పుల ఘటన జరిగినట్లు అప్పట్లో ప్రచారం సాగింది. కాగా, వివేకా హత్య కేసులో రెండో నిందితుడైన సునీల్‌యాదవ్‌కు భరత్‌కుమార్ సమీప బంధువు.

- గండికోట ముంపు పరిహారంలో అర్హులకు కాకుండా అనర్హులకు పరిహారం ఇస్తున్నారంటూ వైసీపీపై పి.అనంతపురానికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి గురుప్రతాప్ రెడ్డి ఫిర్యా దు చేశారు. అక్రమాలపై 2020 నవంబరులో పి.అనంతపురంలో అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఆ పక్కనే గురుప్రతాప్‌రెడ్డిని దారుణంగా చంపివేశారు. అది అప్పట్లో సంచలనం రేపింది.

పోలీసులంటే చిన్నచూపు

ఒకప్పుడు పోలీసులంటే అసాంఘిక శక్తులు, రౌడీలకు భయం ఉండేది. అయితే జగన్ సీఎం అయిన తరువాత పోలీసులపై దాడులకు తెగబడ్డారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో విజిలెన్స్ సీఐగా పనిచేసిన అనిల్‌కుమార్‌కు కడపలోని కోఆపరేటివ్ కాలనీలో సొంత ఇల్లు ఉంది. ఈ ప్రాంతంలోనే వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, ఎమ్మెల్యే పీఏకి చెందిన హోటల్ సిబ్బంది ఉండేవారు. ఈ నేపథ్యంలో సీఐకి, హోటల్ సిబ్బందికి మధ్య వివాదం తలెత్తగా... శంకరాపురానికి చెందిన వైసీపీ గుంపు ఏకంగా సీఐపై దాడిచేయడం అప్పట్లో కలకలం రేపింది. ఇక నిబంధనలకు మించి మద్యం బాటళ్లను తీసుకెళుతున్న ఓ వ్యక్తిని ప్రొద్దుటూరుకు చెందిన ఎస్‌ఈబీ పోలీసులు అరెస్టు చేశారు. తన అనుచరుడ్ని విడిపించడం కోసం స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే ఎస్‌ఈబీ పోలీసులపై విరుచుకుపడ్డారు. చివరికి ఎస్పీ అమ్మ మొగుడికి చెప్పుకోపో అంటూ చేసిన వ్యాఖ్యలు పోలీసు వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారాయి.

వైసీపీ నేతలకు హాండ్సప్ అయిన ఖాకీలు



ఒకప్పుడు కడప పోలీసులంటే ఉమ్మడి రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేవారు. ఉమేష్‌చంద్ర ఎస్పీ అయిన హయాంలో రౌడీయిజాన్ని అంతమొందిస్తే ఫ్యాక్షనిస్టులను జిల్లా నుంచి తరిమికొట్టారు. సీఎం జగన్ తాత రాజారెడ్డి కూడా అప్పటి ఎస్పీ ఉమేష్‌చంద్రకు బాధితుడే అంటారు. కడపలో చిల్లర కోసం హత్య చేస్తున్న వారిని కూడా ఆయన హయాంలోనే తుదముట్టించారంటారు. అయితే ఫ్యాక్షన్ ముగిసిన తరువాత ఎస్పీగా వచ్చిన సజ్జన్నార్ జిల్లాలో నక్సలిజాన్ని తుద ముట్టించడంతో తన మార్కు చూపించారంటారు. అయితే గతంలో పనిచేసిన ఎస్పీలంతా పోలీసులకు ఎక్కడా డ్యామేజీ లేకుండా స్టేట్‌లో ఖాకీ పవరేంటో చూపించేవారు. అయితే వైసీపీ వచ్చిన తరువాత దొంగలను, ట్రబుల్‌మాంగర్లను హ్యాండ్సప్ చేయాల్సిన పోలీసులు వైసీపీ నేతలకు హ్యాండ్సప్ అయి వారు చెప్పినట్లు వింటూ... పోలీసులంటేనే వైసీపీ ప్రైవేటు సైన్యంగా మార్చారనే విమర్శ ఉంది. కొందరు పోలీసు బాస్‌లు, కానిస్టేబుళ్లు దీన్ని జీర్ణించుకోలేకున్నప్పటికీ పై స్థాయిలో ఉన్న పరిస్థితుల కారణంగా వన్‌సైడే అయిపోయారన్న ఆరోపణ ఉంది. అందుకే వైసీపీ నేతలు కూడా వీళ్లా మావాళ్లే, మా సైన్యమేనంటూ చూస్తూ.. వారు వినకపోతే వేధించడం, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారనే చర్చలకు తావిస్తోంది.

ఇసుక దందాను అడ్డుకున్న మహిళా ఎస్ఐపై...

గతంలో ప్రొద్దుటూరు పెన్నానది సమీపంలో కొందరు వైసీపీ ముఖ్యనేత అనుచరులు ఇసుకను అడ్డంగా తోలుతున్నారనే ఆరోపణలున్నాయి. అర్ధరాత్రి తరువాత ట్రాక్టర్లు ఇతర వాహనాల ద్వారా ఇసుకను తోలుకుంటూ లక్షలు గడిస్తున్నారు. అయితే ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వన్‌టౌన్ ఎస్ఐ హైమావతిపై ఇసుకాసురులు రాళ్లతో దాడి చేయడం సంచలనంగా మారింది. ఈ ఘటనలో ఆమె జేబులోని సెల్‌ఫోను పగిలిపోవడంతో కాళ్లకు గాయమైంది. గత ఏడాది మే, జూన్‌లో సీకే దిన్నె మండలంలోని కొలుములపల్లె గుట్ట నుంచి అనుమతి లేకుండా వైసీపీ నేతలు గ్రావెల్ రవాణా చేస్తున్నారు. దీన్ని అడ్డుకున్న అధికారులపై దాడి చేశారు. దీంతో సీకేదిన్నె పోలీసులు ఏఎస్ఐ సురేష్‌ను అక్కడికి పంపగా వైసీపీకి చెందిన మల్లిఖార్జున ఏఎస్ఐపై దాడికి పాల్పడ్డారని చెబుతారు. చెక్‌పోస్టు వద్ద కారును అడ్డుపెట్టగా తొలగించారని కోరినందుకు ఓ ఏఎస్‌పై వైసీపీ నేత మల్లిఖార్జున దాడి చేయడం కలకలం రేపింది. ఈ ఘటనలు ఇలా ఉంటే.. మైనింగ్ అధికారులపై వైసీపీ మూకలు దాడి చేయడం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇక కడపలో అయితే వైసీపీ నేతలు గ్యాంగ్‌లనే నడుపుతూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. జగన్ పాలనంతా అరాచకానికే కేరాఫ్‌గా మారిందంటారు. పోలీసులను చితకబాదినా కూడా పట్టించుకోలేని పరిస్థితి ఉంది. ఇక మళ్లీ జగన్ వస్తే నాశనమే అన్న భయం ఉద్యోగ వర్గాల్లో ఉంది.

ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు
నోటిఫికేషన్ విడుదల

- నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 4400 సీట్ల భర్తీకి చర్యలు
- మే 8 నుంచి దరఖాస్తులు
- జూలై 11న ఎంపిక జాబితా విడుదల

వేంపల్లె, మే 6: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రిపుల్‌ఐటీల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సు కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో 4400 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నామని ఆర్జీయూకేటీ చాన్సిలర్ ప్రొఫెసర్ కేసీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఈ ఏడాది ఇప్పటికే 10వ తరగతి పరీక్ష ఫలితాలు విడులైన నేపథ్యంలో నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో 1000 సీట్లు, ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో వంద సీట్లు కేటాయించారు. ఈ ఏడాది 10వ తరగతి పాసైన విద్యార్థులు మే 8వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయూకేటీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 25 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు ఉంది. జూలై 11వ తేదీ మెరిట్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజీ మార్కులు ఇచ్చి ఎంపిక జాబితా విడుదల చేస్తారు. జూలై 3వ వారంలో ఎంపికైన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నామని చాన్సిలర్ ఆ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక కేటగిరీకి ఫిజికల్ హ్యాండిక్యాప్, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ స్కౌట్స్ విద్యార్థులకు జూలై 5వ తేదీ నూజివీడులో సర్టిఫికేట్ల పరిశీలన ఉంటుంది. పీయూసీకి ఫీజు రూ.45వేలు, ఇంజనీరింగ్ డిగ్రీకి రూ.50వేలుగా ఆర్జీయూకేటీ నిర్ణయించిందని చాన్సిలర్ తెలిపారు.

హజ్ హౌస్‌పై ఇంత నిర్లక్ష్యమా!

- డిప్యూటీ సీఎం చేతగానితనంతో దుస్థితి
- శాసనమండలి మాజీ చైర్మన్ మండిపాటు

చెన్నూరు, మే 6: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉప ముఖ్యమంత్రి, మైనార్టీశాఖ మంత్రిగా ఉన్న అంజద్‌బాషా హజ్ హౌస్ పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించాడని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ మండిపడ్డారు. చెన్నూరు సమీపంలో గల హజ్‌హౌస్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019లో చంద్రబాబు హజ్‌హౌస్ ను ప్రారంభిస్తే.. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రాగా, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తన శాఖకు సైతం నిధులు కేటాయించుకోలేక ఉత్సవ విగ్రహంగా మారారన్నారు. చంద్రబాబు గతంలో ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాదులో 11అంతస్తుల హజ్‌హౌస్ కట్టారన్నారు. రాష్ట్రం విడిపోయాక ఆయన ముఖ్యమంత్రి కాగానే ముస్లిం మైనార్టీలపై ఉన్న ప్రేమతో రెండుచోట్ల హజ్‌హౌస్ నిర్మాణాలు చేపట్టగా.. అందులో కడప ఒకటి అన్నారు. 13 ఎకరాల వక్ఫ్‌బోర్డు స్థలంలో రూ.25 కోట్లతో నిర్మాణం చేపట్టగా 95 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఐదు శాతం పెండింగు పనులు ఉంటే వాటికి నిధులు కేటాయించలేని దౌర్భాగ్య స్థితిలో ఉప ముఖ్యమంత్రి పదవిలో అంజద్‌బాషా కొనసాగారని మం డిపడ్డారు. కేవలం మంత్రిగా ఉత్సవ విగ్రహంగా ఉండి మైనార్టీలకు తీరని ద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, కార్యదర్శి మన్సూరు అక్బర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రెడ్డికరీం, పలువురు ముస్లిం మైనార్టీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ ఆధ్వర్యంలో 140 సీట్లు తథ్యం

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని.. అది తెలిసి సీఎం జగన్ ప్రజల మధ్య, కులాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నాడని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు రావడంతో సీఎంకు సామాజిక వర్గాలు గుర్తుకు వచ్చాయని, రకరకాల ఎత్తుగడలు వేసి గులకరాయి డ్రామా ఆడుతున్నారన్నారు. చంద్రబాబు పాలనలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసి నిధులు విడుదల చేస్తే ఇప్పుడు వాటన్నింటికీ కోత పెట్టి ఆ సంక్షేమానికే సమాధి కట్టారన్నారు.

నేడు కేంద్రమంత్రి రాజనాథ్‌సింగ్ రాక

బద్వేలు, మే 6: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్నకు మద్దతుగా బద్వేలుకు కేంద్ర రక్షణశాఖామంత్రి రాజ్‌నాథ్ సింగ్ వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బద్వేలు ఆర్టీసీ బస్టాండు వద్ద సాయంత్రం 3.30 గంటలకు బహిరంగసభ ఉంటుందని, నియోజకవర్గం లోని బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు. అలాగే కేంద్రమంత్రి సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్‌రెడ్డి కోరారు.

హెలిప్యాడ్ స్థలం పరిశీలన

కేంద్ర మంత్రి రాజనాథ్‌సింగ్ బద్వేలుకు రానున్న సందర్భంగా ఎస్‌ఎస్‌జీ కమాండర్ అధికా రులతో కలిసి హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. బిజివేముల వీరారెడ్డి కళాశాల ఆవరణ, మున్సిపల్ కార్యాలయం వద్ద పలుచోట్ల వారు హెలిప్యాడ్ స్థలం పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు, బద్వేలు నాలుగురోడ్ల కూడలి రోడ్ మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆకుల వెంకట రమణ, మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు, బీజేపీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అంగడి వీధిలో ప్రచారం చేస్తున్న రామకృష్ణ

సీకేదిన్నె, మే 6: జగన్ పాలనలో ఆంధ్ర రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామక్రిష్ణ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం అంగడి వీధి, ప్రొఫెసర్స్ కాలనీ, చిన్నముసల్‌రెడ్డిపల్లె, బాబానగర్, తెలుగుగంగ కాలనీ, మామిళ్లపల్లె తదితర గ్రామాల్లో సోమ వారం ఇండియా కూటమి అభ్యర్థులు షర్మిలారెడ్డి, గాలి చంద్రకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్ర రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేసి అప్పుల ఊబిలో కూరుకుపోయే విధంగా తయారు చేశారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చి మూడు రాజధానులంటూ కాలం వెళ్లబుచ్చాడన్నారు. ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను రూ.6 వేలకు కొనుగోలు చేసిన ఘనత జగన్ పార్టీకే దక్కుతుందన్నారు. ఇసుక, మద్యం, మైనింగ్‌లలో అక్రమంగా డబ్బులు సంపాదించి ఓట్లకు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి కొనుగోలు చేసే నీచ సంస్కృతిని రాష్ట్రంలో ప్రవేశపెట్టాడన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓబులేసు, ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్‌రావు, వెంకటశివ, గుంటు వేణుగోపాల్, బాదుల్లా, బషీరున్నీసా పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడ్డ
వైసీపీ నాయకుడు వడ్ల దాదాపీర్ అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం, మే 6: యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు అనుచరుడు, వైసీపీ నాయకుడు అయిన వడ్ల దాదాపీర్‌ను పోలీసులు అరెస్టు రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. గతంలో బాధిత యువతి కుటుంబం వడ్ల దాదాపీర్ ఇంటిపైన బాడుగకు ఉండేవారు. ఈ క్రమంలో ఎవ్వరూ లేని సమయంలో అతను ఇంటికి వచ్చి మాయమాటలు చెప్పి యువతిని లొంగదీసుకున్నాడు. ఈ విషయం బయటికి వస్తే చంపేస్తానని వడ్ల దాదాపీర్ బెదిరించాడు. ఎవ్వరిని పెళ్లి చేసుకోకూడదని తన వద్దే ఉండాలని హెచ్చరించాడు. చివరకు యువతి నిశ్చితార్థం కూడా చెడగొట్టాడు. ఇల్లు ఖాళీ చేసి మరో ఇంట్లో చేరినా అతని వేధింపులు ఆపలేదు. యువతి నగ్నచిత్రాలను వాట్సప్‌లకు పంపి వైరల్ చేస్తానని బెదిరించాడు. ఆందోళనకు గురైన బాధిత యువతి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సోమవారం వడ్ల దాదాపీర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే.. అత్యాచారం కేసు నందితున్ని అతని సొంత వాహనంలోనే కోర్టు నుంచి జైలుకు తీసుకెళ్లడంతో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైసీపీలో పోస్టల్ బ్యాలెట్ కలవరం

- కూటమి వైపే మొగ్గు
- పోలింగ్‌కు ముందే ఓటరు మూడ్ తెలిసిందన్న పరిశీలకులు
- ఆందోళనలో వైసీపీ శ్రేణులు
- ఇదీ మా సెక్షన్ ఓట్లు కాదంటూ కవర్‌డ్రైవ్‌లు
- పోలింగ్ కేంద్రం వద్దనే డబ్బులు పంపిణీ
- టీడీపీ, వైసీపీల వాగ్వాదంతో ఉద్రిక్తత
- పోలీసుల రంగప్రవేశం

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా వారం ముందు జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సరళి చూసి వైసీపీలో కలవరం మొదలైంది. వైనాట్ 175 అంటూ ఊదర గొడుతున్న జగన్ శిబిరానికి మళ్లీ నీవెందుకనే విధంగా ఉద్యోగులు బైబై జగన్ అంటూ తీర్పు ఇచ్చారని సమాచారం. దీంతో వైసీపీ శిబిరంలో ఆందోళన మొదలైందని చెబుతున్నారు. డబ్బుతో ఏమైనా చేయవచ్చనే ధీమాతో ఉన్న జగన్ అండ్ కో ఓటుకు ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని అంటారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఉద్యోగులను కూడా డబ్బుతో కొనేసి ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించుకుందామని స్కెచ్‌వేశారు.

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు రూ.2వేల నుంచి 3వేలు పంచార ని చెబుతారు. 2019లో జగన్ చంద్రబాబు ఇచ్చే డబ్బులు తీసుకోండి నాకు ఓటు వేయండి అన్నాడు. సేమ్ అదే సీన్ రివర్స్ అయింది. ఇప్పుడు జగన్ అండ్‌కో వద్ద డబ్బులు తీసుకుని పోస్టల్ మెజార్టీ ఉద్యోగులంతా ఎన్‌డీయే కూటమి అభ్యర్థులతోపాటు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలాకు ఓట్లు వేయడమే ఇప్పుడు వైసీపీని కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తరువాత ఆ ఓట్లు మావికావు అంటూ మాకు వేరే ఓట్లు ఉన్నాయంటూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డి చెప్పుకొచ్చారు. పోస్టల్‌బ్యాలెట్ ఎన్నికల్లో టీడీపీ, షర్మిలాకు ఓట్లు పడుతుండడం చూసి ఖంగుతిన్న వైసీపీ బ్యాచ్ విషయాన్ని కడపలో నేతల వద్ద ప్రస్తావిస్తే ఈ సెక్షన్ ఓట్లు మనవి కాదు, మన ఓట్లు వేరే అంటూ కవర్‌డ్రైవ్ చేసుకోవడం చూసి వైసీపీ నేతలు అవాక్కవుతున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇదే మాట చెపితిరి చివరికి ఓటమి పాలు చెందితిమి, ఇప్పుడు కూడా సేమ్ సీన్ రిపీట్ అవుతుందనే భయం వైసీపీలో ఉంది.

కడప జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 23,203 ఉన్నాయి. ఆదివారం 13,536 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక సోమవారం పోలీసులకు ఓటింగ్ నిర్వహిం చారు. పోలీసులతో పాటు ఓటు వేయలేని వారికి ఇంటి దగ్గర నుంచి ఓటింగ్ (హోం ఓటింగ్) నిర్వహించారు. అయితే పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో మెజారిటీ ఓట్లు ఎన్‌డీఏ కూటమి, షర్మిలా కూటమికే పడ్డాయని చెబుతున్నారు. పోలింగ్ కేంద్రాల వద్దనే వైసీపీ నేతలు మకాం వేసి ఓటు ఉన్న వారికి నగదు, మరికొందరికి డిజిటల్ పేమెంటు ద్వారా డబ్బులు చెల్లించారు. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని డిసైడ్ అయిన ఉద్యోగులు డబ్బులు తీసు కోకపోతే ఎక్కడ అనుమానిస్తారనే అనుమానంతో వారి వద్ద డబ్బులు తీసుకుని కూటమికే ఓట్లు వేసినట్లు ఉద్యోగవర్గాలలో బాగా చర్చ సాగుతోంది. మళ్లీ మాదే గవర్నమెంటు మళ్లీ మేమే అనుకుంటూ జగన్ అండ్ కో మత్తులో ఉన్న సొంత కేడరుకు పోస్టల్‌బ్యాలెట్ హోం ఓటింగ్ పోలింగ్ సరళిని చూసి మైండ్‌బ్లాక్ అయినట్లు చెబుతున్నారు. ఓ వైసీపీ నేత మాట్లా డుతూ మాకు పోస్టల్ బ్యాలెట్‌లో మా పాలన తెలిసిపోయింది.. ఉద్యోగులంతా కసిగా ప్రభు త్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు అర్థమవుతుంది.. మా సినిమా అయిపోయిందంటూ చెప్పుకొచ్చారు.



గాంధీనగర్ స్కూల్ వద్ద టీడీపీ వైసీపీల మధ్య తోపులాట

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

ఈ ఎన్నికలను టీడీపీ, వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. రెండు పార్టీలకు డూ ఆర్ డై సమస్య. అందుకే పోస్టల్‌బ్యాలెట్ ఉద్యోగుల ఓట్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన పోస్టల్‌బ్యాలెట్ ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఉద్రి క్తత చోటు చేసుకుంది. టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి పోలింగ్ బూత్ సరళిని పరిశీలించేందుకు వెళుతుంటే ఆమె వెంట వైసీపీకి చెందిన భరత్‌రెడ్డి ఫాలో అవుతూ వచ్చారు. ఎక్కడ పోతే అక్కడికి భరత్‌రెడ్డి వెంట వస్తుండడంతో చిర్రెత్తుకొచ్చిన ఆమె నువ్వేంది నా తోకలా వెంట వస్తున్నావు, నీ తీరు ఏమీ బాగాలేదంటూ గాంధీనగర్ స్కూలు వద్ద అభ్యతరం వ్యక్తం చేశారు. భరత్‌రెడ్డి కూడా ప్రతిస్పందించడంతో ఇరుపార్టీల నేతలు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ వాగ్వాదానికి దిగారు. పరిస్థితి శ్రుతిమించడంతో పోలీసులు ఇరువర్గాలను చెదర గొట్టారు.

టీడీపీని గెలిపిస్తే అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సమానత్వం

- ప్రజా సంక్షేమ పాలనే టీడీపీ లక్ష్యం
- అన్నివర్గాల అభివృద్ధే ధ్యేయం
- మైనార్టీలకు పూర్తి సహకారం
- ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి






కడప నగరంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మాధవీరెడ్డి... మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి.. పార్టీలో చేరిన కాంగ్రెస్, వైసీపీ, బలిజ సంఘం ప్రతినిధులు. రోడ్‌షోలో జన ప్రభంజనం

కడప (ఎర్రముక్కపల్లె), మే 6 : ప్రజా సంక్షేమపాలనే టీడీపీ ఏకైక లక్ష్యమని ఆ పార్టీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. మైనార్టీలకు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. సోమవారం కడప నగరం 25, 26 డివిజన్లలో అన్నమయ్యసర్కిల్, ఆకులవీధి సమీపంలో రోడ్‌షో, అనంతరం కార్నర్ సమావేశం నిర్వహించారు. అలాగే 22, 24 డివిజన్‌లలో రాజారెడ్డి టి.జంక్షన్ సమీపంలో రోడ్‌షో నిర్వహించి కార్నర్ సమావేశం నిర్వహించారు. అనంతరం 23వ డివిజను నాగరాజుపేటలో రోడ్‌షో నిర్వహించి కార్నర్ సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన, సూపర్‌సిక్స్ పథకాలు ప్రజల్లో నాటుకుపోయాయన్నారు. ముస్లిం మైనార్టీలకు టీడీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

హజ్‌హౌస్‌కు పూర్వవైభవం

కడప నగరంలో నిరుపయోగంగా ఉన్న హజ్‌హౌస్‌ను పునరుద్ధరించి పూర్వవైభవం తీసుకువస్తామని శ్రీనివాస రెడ్డి, మాధవీరెడ్డి తెలిపారు. అక్కడే అన్ని వసతులతో నూతన షాదిఖానాతో పాటు అందరూ సేదదీరేలా కొత్త పార్కులు నిర్మిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో షహమీరియా బ్రిడ్జి, లాకాలేజీ బ్రిడ్జి నిర్మించి ప్రయాణాలకు మార్గం సుగమనం చేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైన ప్రదేశాలను గుర్తించి కొత్త రోడ్లు, బ్రిడ్జీలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముస్లిం మత పెద్దలు, ఇమాం మౌజన్లకు మసీదు కమిటీ సభ్యులకు సొంత ఖర్చులతో రూ.పది లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ముస్లిం మత పెద్దలకు కుటుంబ సభ్యులుగా చేదోడు వాదోడుగా చంద్రబాబు ఉంటారన్నారు. పేద, మధ్యతర గతి ముస్లిం సోదరీమణులు వారి కాళ్ల మీద వారు నిలబడే విధంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులైన ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు అందించి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. ఆర్థిక సమస్యలతో చదువుకు దూరమవుతున్న పిల్లలను గుర్తించి విద్యావకాశాలు కల్పిస్తామన్నారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా ముస్లింలకు మసీదుల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు సమన్వయంతో స్థానికంగా అవసరమైన కొత్త నిర్మాణాలు సదుపాయాలు కల్పిస్తామన్నారు. కబ్జాకు గురవుతున్న వక్ఫ్‌బోర్డు భూములు పరిరక్షిస్తామన్నారు. నకాశ్ శ్మశాన వాటిక డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నకాశ్ స్మశాన వాటికలోకి డ్రైనేజీ నీరు రాకుండా కొత్తకాల్వలు నిర్మించి గ్రౌండ్‌లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల నిర్మాణం పేరుతో జగన్ అప్పులపాలు చేశారన్నారు. టీడీపీ హయాంలో కట్టించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. చంద్రన్న అధికారంలోకి వచ్చి ఉంటే మొదటి ఏడాది నుంచే రూ.3వేలు పింఛను ఇచ్చి ఉండేవారని, వాయిదాల వల్ల ఒక్కో అవ్వా తాత రూ.30వేలు నష్టపోయారన్నారు. అంగన్వాడీ జీతాలు టీడీపీ ప్రభుత్వంలో 6300కు పెంచగా, జగన్ సీఎం అయ్యాక కేవలం వెయ్యి మాత్రమే పెంచి మోసం చేశారన్నారు.

వైసీపీ హయంలో ఆడపడుచులకు మోసం

జగనన్న పాలనలో ఆడపడుచులకు మోసం చేశారని మాధవీరెడ్డి ఆరోపించారు. 2014 ఏప్రిల్ 1 నాటికి డ్వాక్రా సంఘాల ఎన్పీఏలు 10.33శాతం ఉండగా, 2019 ఏప్రిల్ 1 నాటికి 1.56 శాతానికి తగ్గించారని, అయితే జగన్‌రెడ్డి 18 శాతం అంటూ నిస్సిగ్గుగా పేర్కొనడం దారుణమయన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మహిళలపై నేరాలు పెరిగాయన్నారు. ఎన్సీఆర్‌బీ ప్రకారం 2022లోనే మహిళలపై 25,503 నేరాలు, 601 అత్యాచారాలు, 180 అత్యాచార యత్నం ఘటనలు వెలుగు చూశాయన్నారు. జాతీయ స్థాయిలో మహిళలపై నేరాల రేటు 66.4 కాగా ఏపీలో మాత్రం 96.2 శాతం నమోదు కావడం మహిళా భద్రతలో జగన్‌రెడ్డి డొల్లతనాన్ని తెలియజేస్తోందన్నారు. వైసీపీ పాలనలో 30196 మంది మహిళలు, చిన్నారులు మిస్సయ్యారన్నారన్నారు. 2019తో పోలిస్తే 2021 మహిళల అదృశ్య ఘటనలు 43.45 శాతం, చిన్నారుల అదృశ్యం ఘటనలు 53.61 శాతానికి చేరాయన్నారు జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల కాలంలో మహిళలపై 2లక్షలకు పైగా నేరాలు నమోదయ్యాయని, దేశ వ్యాప్తంగా మహిళలపై జరిగే నేరాల్లో మూడోవంతు ఏపీలో జరుగుతున్నాయన్నారు.

ప్రజల భూములను కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్

అలాగే ప్రజల భూములను కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్‌యాక్టును జగన్‌రెడ్డి ప్రవేశపెట్టినట్లు టీడీపీ నేతలు తెలిపారు. దేశంలో ఇప్పటివరకు బీజేపీ రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రం ల్యాండ్ టైటలింగ్ యాక్టును అమలు చేయలదన్నారు. ఆ చట్టం చేయడానికి జగన్ ఎందుకు తొందరపడ్డారని ప్రశ్నించారు. ప్రజల భూములను కబ్జా చేసేందుకే జగన్‌రెడ్డి ప్రభుత్వం ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలో ఈ చట్టం 2023 అక్టోబరు 31 నుంచే అమల్లోకి వచ్చినట్లు వైసీపీ ప్రభుత్వం జీవో నెం.512ను తెచ్చిందని గుర్తు చేశారు. ఏపీ ల్యాండ్ ఆథారిటీని ఏర్పాటు చేసి దానికి చైర్‌పర్సన్, కమిషనర్, సభ్యులను నియమిస్తూ 2023 డిసెంబరు 29న ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ భూ భక్ష చట్టంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి ఈ చట్టానికి ఇంకా మార్గదర్శకాలు ఇవ్వలేదంటూ వైసీపీ ప్రభుత్వం బూటకపు మాటలు చెబుతోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఈ చట్టం చేయకముందే ఇక్కడ చట్టం ఎందుకు చేశారో జగనన్న సమాధానం చెప్పాలన్నారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం కొల్లగొట్టడం ద్వారా 8లక్షల కోట్లు వైసీపీ ప్రభుత్వం ప్రతినిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ పాపపు సొమ్మును తరలించడానికి సివిల్ కోర్టులు అడ్డంకిగా ఉన్నాయని కోర్టుల రక్షణ తొలగించడానికి రెవెన్యూ అధికారులకు సివిల్ కోర్టుల అధికారాన్ని కట్టబెడుతూ ల్యాండ్‌టైటలింగ్‌యాక్టు తెచ్చారన్నారు. జగన్‌రెడ్డి బినామీ కంపెనీ అయిన ఇండోసోల్ కంపెనీకి ఒక్క రామాయపట్నం పరిసరాల్లోనే 8500 ఎకరాలు రైతుల భూములను కారుచౌకగా కట్టబెట్టే యత్నం చేశారన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా జగన్ భూ మాఫియా లక్షలాది ఎకరాలు కబ్జా చేయడానికే తొందర తొందరంగా ఈ చట్టం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి ఓటువేయడమంటే మన భూ హక్కులను మన ఆస్తి హక్కులపై అధికారాన్ని పూర్తిగా వైసీపీ నాయకులకు కట్టబెట్టినట్లు అవుతుందన్నారు. ఈ చట్టంలోని సెక్షన్ 5లో టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసరు (టీఆర్వో) నియామకం గురించి ఉందన్నారు. ఏ వ్యక్తినైనా, వ్యక్తులనైనా టీఆర్వోగా నియమించవచ్చని అందులో ఉందన్నారు. టీఆర్వోలుగా జగన్ ముఠా వారికి నచ్చిన వారిని నియమిస్తారన్నారు. ల్యాండ్ టైటలింగు రిజస్టరు అసలు యజమానుల పేర్లకు బదులు వైసీపీ వారు చెప్పిన పేర్లు రాయించుకుని భూ కబ్జాలకు పాల్పడతారన్నారు. ఏదైనా ఆస్తి తమదేనంటూ ఎవరైనా తప్పుడు క్లెయిమ్ దాఖలు చేస్తే ఆ ఆస్తి వివాదంలో ఉన్నట్లు డిస్ట్రిక్ట్ రిజిస్టరులో టీఆర్వో నమోదు చేస్తారన్నారు. దీనిపై నిజమైన యజమాని సివిల్ కోర్టుకు వెళ్లేందుకు అవకాశం లేకుండా ఈ చట్టం నిరోధిస్తుందన్నారు. ఇలా అనేక ప్రమాదకర సెక్షన్‌లు ఈ చట్టంలో చేర్చారని, దీని ద్వారా లక్షలాది ఎకరాలు కబ్జా చేయడానికి కారుచౌకగా కొట్టేయడానికి ఆఘమేఘాల మీద ఈ చట్టాన్ని వైసీపీ ప్రభుత్వం చేసిందన్నారు. మన ఆస్తులకు మనం యజమానులుగా ఉండాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు కుసుమకుమారి, మైనార్టీ రాష్ట్ర నాయకుడు జిలానీబాషా, కడప నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, జనసేన నాయకులు తుంగా రమణయ్య, రంజిత్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మాసాపేట శివ, టీడీపీ నాయకులు బండి బాబు, తౌసిఫ్, షబ్బీర్ , గిరి, అశోక్‌రెడ్డి, శ్రీనివాసులు, గురప్ప,గౌతం, వేణు, అనిల్, గౌస్, రవితేజ, సుబ్బయ్య, రవి, జగన్‌తోపాటు బీజేపీ, జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు...

ద్వారకనగర్ టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి నివాసంలో సోమవారం టీడీపీ కడప నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డిస మక్షంలోకాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ చైర్మన్ మూర్తి, వైసీపీ యువజన విభాగం కార్యదర్శి సుధీర్, బలిజ సంఘం మహిళా అధ్యక్షురాలు కవిత, లక్ష్మి, మంజుల, అన్వర్‌బాషా, జిలానీబాషా, వలి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చెన్నంశెట్టి మురళీక్రిష్ణ, బండి ప్రతాప్, ఎద్దుల శంకర్, సాయి, బద్రి, విజయ్ పాల్గొన్నారు.

35వ డివిజనులో...

కడప నగరం 35వ డివిజను నకాశ్‌లో స్థానికులు వైసీపీ నుండి టీడీపీలో చేరారు. వారికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మైనార్టీ నాయకులు రఫిక్‌ఖాన్‌తో పాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మన్సూర్, జిలానీబాషా, జావీదు, సాదక్ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీని ఓడించండి'



సమావేశంలో మాట్లాడుతున్న కారు ఆంజనేయులు

కడప (సెవెన్‌రోడ్స్), మే 6 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక సీమ కన్వీనరు కారు ఆంజనేయులు, జిల్లా కన్వీనరు బందెల ఓబయ్య, డీఎం ఓబులేసు అన్నారు. సోమవారం జీఆర్‌డీఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. అనంతరం కారు ఆంజనేయులు మాట్లాడుతూ జగన్ ప్రజలకు చేసిన మోసాలు, నయవంచన గురించి తీవ్రంగా విమర్శించారు. రాయలసీమ, కర్నూలులో న్యాయరాజధాని ఏర్పాటు చేశావా అని ప్రశ్నించారు. కనీసం బెంచ్ అయినా ఏర్పాటు చేయలేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఉక్కు ఫ్యాక్టరీ పనులు ప్రారంభిస్తామని చెప్పి శంకుస్థాపనలకే పరిమితం చేశారని మండిపడ్డారు. రాయలసీమ పారిశ్రామిక హబ్ చేస్తానని అనడం, పెండింగు ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం, అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులకు న్యాయం చేయకలేకపోవడం ఇవన్నీ జగన్ మోసపూరిత వాగ్దానాలే అన్నారు. పైగా తన పాలనలో మంచి జరిగి ఉంటే ఓటు వేయమనడం హాస్యాస్పదమన్నారు. సీమకు మంచి ఏం జరిగిందో చెప్పాలన్నారు. ఇప్పటికైనా రాయలసీమ మేధావులు, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కడప(కలెక్టరేట్), మే 6: హజ్ యాత్రకు వెళ్లేవారికి సోమవారం పాతరిమ్స్‌లోని యూపీహెచ్‌సీ, రాధాకృష్ణ నగర్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి నాగరాజు మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే 234 మంది యాత్రికులకు వ్యాక్సినేషన్ వేయాల్సి ఉందన్నారు. ఈనెల 9న హజ్ యాత్రకు వెళ్లే 12 మందికి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించామన్నారు. మిగతా 222 మందికి ఈ నెల 9న ఉదయం 8 గంటల నుంచి వ్యాక్సినేషన్ వేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమా మహేశ్వర కుమార్, అర్బన్ నోడల్ అధికారి డాక్టర్ ఉబేదుల్లా, మెడికల్ ఆఫీసరు డాక్టర్ సుమధుర, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల, తెలికుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు టౌన్, మే 6: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన గాండ్ల, తెలికుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగమయ్య, ఉపాధ్యక్షుడు జి.సి.పుల్లయ్య తెలిపారు. 10వ తరగతిలో 450 మార్కులు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 850 మార్కులుపైగా సాధించిన గాండ్ల, తెలికుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన పురస్కారాలు అందజేస్తామన్నారు. అలాగే 1 నుంచి 10వ తరగతి చదివే పేద గాండ్ల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు, పరీక్ష అట్టలు, పెన్నులు అందజేస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు ఆంధ్రకేసరి రోడ్డులోని గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దివ్యాంగులకు వైసీపీ పాలనలో అన్యాయం

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనం సుబ్బయ్య యాదవ్



మాట్లాడుతున్న సుబ్బయ్య యాదవ్

కమలాపురం రూరల్, మే 6 : వైసీపీ పాలనలో దివ్యాంగులకు తీరని అన్యాయం జరిగిందని వీహెచ్‌పీఎస్ రాష్ట్రఅధ్యక్షుడు ఆనం సుబ్బయ్యయాదవ్ తెలిపారు. సోమవారం మందాక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు కమలాపురం టీడీపీ ఆఫీసులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో వికలాంగుల కోసం ఎలాంటిపథకాలు చేపట్టలేదని, గతంలో వికలాంగుల పెన్షన్‌ను పెంచాలని విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. అందుకోసం వికలాంగులందరూ కలిసి ఎన్‌డీఏ కూటమికి మద్దతుగా టీడీపీ కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌కు మద్దతు తెలుపుతూ ఈ ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. వికలాంగులను మోసం చేసిన జగన్ రెడ్డికి వ్యతిరకంగా ప్రచారం చేస్తామన్నారు. ఈ ప్రభుత్వంలో ఏపథకం కూడా అందలేని పరిస్థితి ఉందన్నారు. వికలాంగులకు లోన్లు కానీ, వికలాంగుల పెంపు విషయంలో కానీ, వివాహ ప్రోత్సాహ బహుమతి రూ.1.50లక్షలు అందించడంలో కానీ విఫలమైందన్నారు. చదువుతో సంబంధం లేకుండా వివాహ పథకం అమలు చేయాలన్నారు. చంద్రబాబు వస్తే దివ్యాంగుల పింఛను 6వేలు పెంచుతామని మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చంద్రబాబు ఇచ్చిన 23 డిమాండ్లను వెంటనే అమల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధ మాతయ్యమాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు పేదల జీవితాల్లో మలుపు



ఖాజీపేట మండలం మిడుతూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న భూపేష్‌రెడ్డి పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్



ప్రొద్దుటూరు మండలంలోని పెద్దశెట్టిపల్లెలో భూపేషరెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

- టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): టీడీపీ అభ్యర్థులు గెలిస్తే పేదల జీవితాలు మారుతాయని, అందుకే ప్రతి ఒక్కరూ సైకిలు గుర్తు కమలం గుర్తుకు ఓటు వేయాలని కడప పార్లమెంటు టీడీపీ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి చదిపరాళ్ల భూపేష్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని పెద్దశెట్టిపల్లెలో, మైదుకూరు నియోజక్వవర్గంలోని ఖాజీపేట మండలం మిడుతూరులో అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు విజన్ ఉన్న నేత ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ సృష్టికర్త. ప్రపంచంలో తెలుగువారు ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారంటే అది చంద్రబాబు చొరవనే కారణం. ఆయన దూరదృష్టి కారణంగానే ఈ రోజు హైదరాబాదు దేశానికే ఆర్థిక వనరుగా మారిందన్నారు. అమరావతిని కూడా దేశ ఆర్థిక రాజధానిగా మార్చాలనుకుంటే జగన్ వచ్చి సర్వనాశనం చేశారన్నారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబును సీఎంగా గెలిపించుకుంటేనే రాష్ట్ర పునర్వైభవంతో పాటు పేదలందరికీ సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమ పథకాలతో పేదల జీవితాలే మారిపోతాయన్నారు. టీడీపీ వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు వస్తాయని, అందరికీ న్యాయం జరగాలంటే కేంద్రంలో మోదీ ప్రధాని, రాష్ట్రంలో చంద్రబాబు సీఎం కావాలన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తాం

- వైసీపీకి ఓట్లు వేస్తే ప్రజల ఆస్తులు గల్లంతే
- ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి




పెద్దరంగాపురంలో బీటెక్ రవికి స్వాగతం పలుకుతున్న దృశ్యం... ప్రచారం నిర్వహిస్తున్న బీటెక్ రవి సతీమణి లత

పులివెందుల టౌన్, మే 6: అభివృద్ధి చేస్తాం..ఒక్క అవకాశం ఇవ్వండని పులివెందుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి తెలిపారు. సోమవారం పట్టణంలోని పెద్దరంగాపురం, ఉలిమెల్ల గ్రామాలలో ఆయన సతీమణి లతతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దరంగాపురంలో బాణసంచా పేల్చి ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా పోలింగ్ బూత్‌లో బటన్ నొక్కేటపుడు రెండు సెకన్లు ఆలోచించకపోతే ఐదేళ్లపాటు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక, దుర్మార్గ పాలనను తరిమిగొట్టాలన్నారు. పులివెందుల పట్టణ అభివృద్ధికి కంకణం కట్టుకున్నామని, అందరం కలిసి పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేస్తే ప్రజల ఆస్తులు గల్లంతే అన్నారు. 2019 ఎన్నికలకు ముందు జగన్ అధికారంలోకి వస్తే రాజధాని ఉండదని చంద్రబాబు చెప్పారని అపుడు ప్రజలు వినకుండా వైసీపీకి పట్టం కట్టారన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ వైసీపీకి ఓటు వేస్తే ఆస్తులు గల్లంతై జగన్ ఆధీనంలోకి వెళ్తాయని ఆరోపించారు. ప్రజలంతా తనకు తోడుగా నిలవాలని పది రోజుల్లో వైసీపీ నేతలను ఇంటికి పంపుదామని పిలుపునిచ్చారు. టీడీపీ మేనిఫెస్టో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు, ఎంపీగా పోటీచేస్తున్న భూపేష్‌రెడ్డికి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అన్నారెడ్డి ప్రసాదరెడ్డి, తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, అంకాళ్ రెడ్డి, సుబ్బారెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, మహబూబ్ బాష, ఖాసీం వలి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లెలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



నేలవరం తాండాలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన దృశ్యం


వేంపల్లె, మే 6: టీడీపీ విజయం తథ్యమని మండల పరిశీలకులు రఘునాథరెడ్డి అన్నారు. నేలవరం తాండాలో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు సభ్యులు సేవ్యానాయక్, మరికొంత మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శ్రీను నాయక్, వెంకటయ్యనాయక్, భాస్కర్ నాయక్, ఈశ్వర్‌నాయక్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. మైనార్టీ సీనియర్ నాయకులు షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి, ఎస్‌బి జయచంద్రారెడ్డి, పివి రమణ, రాజశేఖర్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి'

కడప(కలెక్టరేట్), మే 6: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని ఎన్నికల రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్‌మోహన్ మిశ్రా ఎన్నికల నోడల్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కేంద్ర ఎన్నికల కమిషన్ ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక సాధారణ పరిశీలకులుగా నియమితులైన రామ్‌మోహన్ మిశ్రా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజుతో కలిసి ఎన్నికల సాధారణ పరిశీలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ రామరాజు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సన్నద్ధం కోసం జిల్లా యంత్రాంగం చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించండి

- బీటెక్ రవిని అఖండ మెజారిటీతో గెలిపించండి..
- పింఛనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ పింఛనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్

పులివెందుల టౌన్, మే 6: రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని ఆంధ్రప్రదేశ్ పింఛనర్స్ పార్టీ అ.ధ్యక్షుడు సుబ్బరాయన్ పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పింఛనర్స్ పార్టీ అధ్యక్షుడు, కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు కలిపి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయి గంజాయి రాష్ట్రంగా మారుతోందన్నారు. ఇపుడు మీ ఓటు ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చుకునేందుకు మంచి అవకాశం అని, అదేవిధంగా యువతకు విద్యా, ఉద్యోగం ఉపాధి కావాలన్నా, రైతులు ఉద్యోగస్తులు బాగుపడాలన్నా చంద్రబాబు అధికారంలోకి రావాలన్నారు. అపుడే కూటమి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుతాయి, మీ బిడ్డలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అంతేకాకుండా మార్పు అనేది పులివెందుల నుంచి ప్రారంభం కావాలని, దేశం అంతా ఇపుడు పులివెందుల వైపు చూస్తున్నారని, కావున పులివెందులలో కూడా బీటెక్ రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, పులివెందుల ప్రాంతానికి ఉన్న చెడ్డపేరును తొలగించి పులివెందుల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలంటే అది ఒక బీటెక్ రవితోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో ఎంతోమంది పింఛనర్లు ఇప్పటి వరకు పింఛన్లు పడక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికి కూడా చాలా మందికి పింఛన్లు పడలేదని అదేవిధంగా వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లలో కూడా రాజకీయాలు చేస్తున్నారన్నారు. వారి రాజకీయ స్వార్థం కోసం అందరిని ఇబ్బంది పెడుతున్నారన్నారు. జనరల్ సెక్రటరీ పెద్దన్న గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని దందా రాష్ట్రంగా మార్చారన్నారు. ఇసుక, మద్యం, ప్రభుత్వ స్థలాలు ఇలా అనేక రకాలుగా రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ రాష్ట్రంలో యువతకు ఎలాంటి ప్రయోజనం లేక ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని, మన పిల్లలు మన దగ్గరే ఉండాలంటే రాష్ట్రంపై అవగాహన ఉన్న పాలనపై అనుభవం ఉన్న వ్యక్తి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మేము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. కావున మీరు కూడా ముందుచూపుతో రాష్ట్రాభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. మా ఆంధ్రప్రదేశ్ పింఛనర్స్ పార్టీ శ్రీకాకుళం నుంచి ప్రతి జిల్లాకు వెళ్లి మా వంతు సహాయంగా కూటమి అభ్యర్థులకు ప్రచారం చేస్తున్నామన్నారు. అందులో భాగంగా పులివెందులకు వచ్చామన్నారు. బీటెక్ రవికి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎన్ మూర్తి, నాగసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుభాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో వైసీపీకి భారీ షాక్

- 200 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానం పలికిన పుత్తా నరసింహారెడ్డి, భూపేశ్‌రెడ్డి, క్రిష్ణచైతన్యరెడ్డి





చెన్నూరు సభలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి, సభకు భారీగా తరలివచ్చిన మహిళలు, భూపేష్‌రెడ్డి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న దస్తగిరిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి అనుచరులు

కమలాపురం రూరల్, మే 6: కమలాపురంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మండల పరిధిలోని జీవంపేట, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె గ్రామాల నుంచి భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. సోమవారం మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, ఓబులరెడ్డి ఆధ్వర్యంలో వారి అనుచరులు దాదాపు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అదేవిధంగా జీవంపేట గ్రామ వైసీపీ నాయకుడు పుత్తా దస్తగిరిరెడ్డి ఆయన సోదరుల కుమారులు, గ్రామస్థులు, పెద్దచెప్పలి గ్రామంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ బొమ్మిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి (చిన్ని) ఆధ్వర్యంలో వారి అనుచరులు కడప పార్లమెంటు టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తాలక్ష్మీరెడ్డి సమక్షంలో దాదాపు 150 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. వీరిందరి చేరికతో ఆ ప్రాంతంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ పాలనలో అన్ని కులాల వారికి అన్యాయమే జరిగిందని జగన్ చెప్పేది ఒకటి, చేసేది ఒకటని ఆయన చెప్పిన మాటలు ఏ ఒక్కటైనా ఎక్కడైనా నెరవేర్చారా అన్నారు. నవరత్నాల పేరుతో నవమాసాలు చేస్తున్నారని, ఎన్నికల సమయంలో అమ్మఒడి అందరికీ అని ఇప్పుడేమో ఒక్కరికే అంటున్నారని విమర్శించారు. రైతులకు ఎలాంటి మేలు జరగలేదని, పంట రుణాల ఇన్సురెన్స్, మద్దతు ధర ఈ ఐదు సంవత్సరాల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చింది జీరో అన్నారు. జగన్‌ను నమ్మి మోసపోయామని, ఇంకా మరోసారి నమ్మలేమంటూ ప్రజలందరూ టీడీపీకి జై కొడుతూ గ్రామ గ్రామాన టీడీపీలో చేరుతున్నారనన్నారు. కడప జిల్లావాసి వైఎస్ బిడ్డగా ఏదో చేస్తారని నమ్మి ఓట్లు వేస్తే ఈ జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. ఇంత భారీ చేరికలు ఎక్కడా చూడలేదని, రాబోవు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం తథ్యమన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టారని, ఈ పథకాల్లో ప్రతి కుటుంబానికి ఏదో ఒక విధంగా న్యాయం జరుగుతుందన్నారు. ఇందులో ప్రతి ఇంటికీ సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితమని, ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20వేలు పంటలు పండించుకునేందుకు రైతు ఖాతాలో వేస్తారన్నారు. ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందని, తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలున్నా అందరికీ రూ.15వేల వంతున తల్లుల ఖాతాల్లో వేస్తారన్నారు. ఇంకా తదితర పథకాలను వివరించారు. కమలాపురం నియోజకవర్గంలో దాదాపు 70 శాతం మంది ప్రజలు టీడీపీ వైపు ఉన్నారన్నారు. వైసీపీ పాలనలో కమలాపురంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

సీకేదిన్నె: టీడీపీ అధికారంలోకి వస్తే బీజీలకు పెద్దపీట వేస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట, కాంపల్లె గ్రామాల్లో 80 కుటుంబాలవారు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో గతంలోనూ బీసీలకు పెద్దపీట వేశారని, ఈసారి కూడా బీసీలకు సముచిత స్థానం కల్పిస్తారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేయడంతోపాటు పోలవరాన్ని నిర్మించి రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు అందించేందుకు కృషి చేస్తారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి అందరి మన్ననలు పొందుతారన్నారు. ఇవేకాక పండుగ కానుకలు, పెళ్లి కానుకలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్టారెడ్డి, మోహన్‌బాబు, డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, వీరూప్రసాద్, సుబ్బారెడ్డి, దర్బార్, శివానంద, వెంకటసుబ్బయ్య, జబివుల్లా, రెడ్డిబాష పాల్గొన్నారు.

చెన్నూరు: ముస్లిం మైనార్టీల కలల సౌధం వారి సాకారం హజ్‌హౌస్. అలాంటి పవిత్ర భవనాన్ని నిరుపయోగంగా పెట్టి మూత వేయించిన పాలకులు మాట తప్పి అమ్మఒడికి కోతపెట్టారు. చివరికి కేసీ ఆయకట్టు రైతులకు ఒక టీఎంసీ నీరిప్పించలేని ఎమ్మెల్యే దద్దమ్మ అంటూ ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. చెన్నూరు పాతబస్టాండులో ఆదివారం సాయంత్రం భారీ బహిరంగసభ జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడితో పాటు కమలాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్‌హౌస్‌కు నిధులు ఇవ్వలేని చేతగాని ప్రభుత్వం ఇది అన్నారు. భూకబ్జాలు చేయడం, కాంట్రాక్టులు చేసుకుని సొమ్ము చేసుకోవడమే ఈ ఎమ్మెల్యే నైజమన్నారు. కేవలం తన అనుచవర్గం బాగుపడేందుకు మాత్రమే ఐదేళ్లపాటు శ్రమపడ్డాడన్నారు. మండల వ్యాప్తంగా సీసీ రోడ్లు వేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. చంద్రబాబు అవ్వతాతలకు రూ.200 పింఛన్‌ను 2వేలు చేస్తే ఇప్పుడున్న సీఎం ఐదేళ్లకు రూ.3వేలు చేసి చంకలు గుద్దుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే జూలై నుండి రూ.4వేలు పింఛను అందుతుందని వికలాంగులకు రూ.6వేలు అందుతుందన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో టీడీపీ రాగానే ఇండస్ట్రియల్ కారిడార్, జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా మార్చి మండల వాసులకు ఇక్కడే 90 శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు

కదంతొక్కిన నారీ లోకం

పుత్తా చైతన్య సభ సందర్భంగా కేసీ కెనాల్ నుంచి పోలీసు స్టేషన్, ఎమ్మార్వో ఆఫీసు మీదుగా బస్టాండుకు వేలాది మందిగా సభకు ప్రజలు తరలివచ్చారు. మహిళలు కదం తొక్కారు. ఈ కార్యక్రమాల్లో యువనేత లక్ష్మీరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి, బలిజ సంఘం జిల్లా నేత ఆకుల ప్రసాద్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శివారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చలపతి, మండల ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, మన్నూరు అక్బర్, మైనార్టీ జిల్లా నేత షబ్బీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు: వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరిస్తే మండలాన్ని అభివద్ధి పథంలో నడిపిస్తామని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, టీడీపీ అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డిసతీమణి చైతన్యరెడ్డి, పుత్తా శివమ్మ, దివ్యశ్రీ, శ్రీలక్ష్మి, పుత్తా సాయి నరసింహారెడ్డి, పుత్తా సోదరుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వల్లూరు పంచాయతీలోని గణేశ్‌పురం, గంగాయపల్లె, ఎ.ఓబాయపల్లె, వల్లూరు మెయిన్, ఎస్సీ కాలనీలో ప్రచారం చేశారు.

గాలివాన బీభత్సం

నేలపై విరిగిపడ్డ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ● అంధకారంలో గ్రామాలు



కొండూరు ఎస్సీ కాలనీ వద్ద నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అట్లూరు, మే 6: అట్లూరు మండలంలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సంగా రావడంతో కొండూరు ఎస్సీ కాలనీ, అట్లూరు క్రాస్‌రోడ్డు, చౌటుపల్లె రెడ్డిపల్లె వద్ద 33కేవీ విద్యుత్ స్తంభాలు వైర్లు తెగిపడడంతో అట్లూరు, వరికుంట, ఆకుతోటపల్లె తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా సోమవారం రాత్రికి ఇవ్వలేమని అట్లూరు ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల మధ్యవిరిగిన విద్యుత్‌స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకుసిబ్బందితో మరమ్మత్తులు నిర్వహించి విద్యుత్ సరఫరా చేస్తామని ఆయన తెలిపారు. అట్లూరు పోలీసు స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకలకు గంటల పాటు అంతరాయం కలిగింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



సంఘటనాస్థలిలో మృతదేహం

వల్లూరు, మే 6: మండల పరిధిలోని ఎయిర్‌పోర్టు ఎదురుగా జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతిచెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు.. ఎయిర్‌పోర్టు వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని కడప వైపు నుంచి ఎర్రగుంట్ల వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుని వివరాలకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, అతని వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన



క్రికెట్ సెలక్షన్స్ ఎంపిక జరుగుతున్న దృశ్యం

కడప (స్పోర్ట్స్), మే 6: క్రికెట్ క్రీడ పట్ల మక్కువ గల జిల్లాలోని వివిధ క్రీడాకారుల సీనియర్ అండర్-23, అండర్-19, పురుషుల క్రికెట్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి విశేష స్పందన లభించింది. ఇందులో సీనియర్స్ విభాగంలో 50 మంది క్రీడాకారులకు గాను 32 మంది ఎంపికయ్యారు. అలాగే అండర్-23 విభాగంలో 70 మంది క్రీడాకారులకు గాను 42 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్-19 విభాగంలో సుమారు 120 మందికి గాను 60 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కాగా త్వరలో ప్రాబబుల్స్ మ్యాచెస్ గురించి తదుపరి తెలుపుతామని సెలక్టర్లు నజీర్ అహ్మద్, అబ్దుల్ రెహ్మాన్ ఫరూక్, శివప్రసాద్, ఆనంద్ కుమార్‌రెడ్డి, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎం.సాయి పృథ్వీతేజ్, సిరాజుద్దీన్ జోలా, సంజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

వల్లూరు, మే 6: ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి క్షేత్రంలో నిర్వహిస్తున్న కామాక్షి సమేత వైద్యనాథేశ్వర శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం ఉదయం వివిధ పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైద్యనాథేశ్వరున్ని హంస వాహనంపై, చెన్నకేశవున్ని తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు కాయకర్పూరం చెల్లించి తమ మొక్కులు తీర్చుకున్నారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొండలనూ కొల్లగొట్టారు



వెల్లటూరు పైభాగాన గాలేరు నగరి కాల్వ మట్టిని తరలించిన ప్రదేశం

- గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు
- ఐదేళ్లలో వైసీపీ నేతల దందా

పెండ్లిమర్రి, మే 6: ప్రకృతి వైపరీత్యాలు తుఫాను, సునామిలాంటి వాటితో కూడా ఇలాంటి నష్టం జరిగి ఉండదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రకృతి సహజమైన ఇసుక, మట్టి, గ్రావెల్‌ను కొల్లగొట్టి కోట్లు గడించారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు వైసీపీతో కుమ్మక్కై సహజ వనరులను సర్వనాశనం చేశారు. కంచె చేను మేసినట్లుగా కళ్లెదుటే అక్రమాలు జరుగుతున్న ఆపలేని నిస్సహాయస్థితిలో అధికారులు ఉండిపోయారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు ప్రభుత్వ పనులకు అవసరాలు ఉన్నాయని సాకులు చెబుతూ.. అక్రమ రవాణాదారుల మామూళ్లకు లాలూచీపడి సహకరించారు. ఏమంటే వారంతా మండల వైసీపీ నాయకులని ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరులని అక్రమ దందాకు అడ్డంగా సహకరించారు.

మండల పరిధిలోని పగడాలపల్లె సర్వే నెంబర్ 172, మాచునూరు సర్వేనెంబరు 39, చిన్నదాసరిపల్లె సర్వే నెంబర్ 15, పెద్దదాసరిపల్లె, గంగనపల్లె, కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామాల పరిధిలో వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో గుట్టలను తవ్వి కోట్లు కొల్లగొట్టారు. అలాగే మండల పరిధిలోని చెరువుల్లో మట్టిని కూడా వదల్లేదు. ఇంకా మండల పరిధిలో గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వ పనులు జరిగాయి. కాల్వకు రెండు వైపుల పూడిక తీసిన మట్టిని వైసీపీ నేతలు అక్రమంగా రవాణా చేసి తమ జేబులు నింపుకొన్నారు. కడప నగరం అభివృద్ధి చెందుతూ ఉండడంతో కడప-పులివెందుల ప్రధాన రహదారి వెంబడి... యోగివేమన విశ్వవిద్యాలయం చుట్టూ కుప్పలు తెప్పలుగా వెంచర్లు వెలిశాయి. అలాగే కొప్పర్తి పారిశ్రామిక వాడలో కొన్ని కంపెనీలు వచ్చాయి. వాటి నిర్మాణానికి గ్రావెల్ అవసరం ఉంది. దీన్ని వైసీపీ నేతలు సొమ్ము చేసుకొన్నారు. ప్రభుత్వానికి చేరాల్సిన రాయల్టీ డబ్బులు ఎరవేసి.. ఎమ్మెల్యే సహకారంతో ఇష్టారాజ్యంగా అక్రమ రవాణా చేసి అధికారం ఉండగానే వెనువేసుకున్నారు. కొంతమంది వైసీపీ నేతలు అయితే వంద టిప్పర్లకు అనుమతి తీసుకొని వెయ్యి టిప్పర్ల మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారు.



చిన్నదాసరిపల్లె రెవెన్యూ పరిధిలో అక్రమంగా తవ్వీన కొండ

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి




మృతి చెందిన రాజేశ్, రాజేశ్ (ఫైల్)

పులివెందుల టౌన్, మే 6: పులివెందుల పట్టణంలోని అంబకపల్లి రోడ్డు నల్లపురెడ్డిపల్లె మార్గంలో రాజేష్ (38) అనే యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందారు. వివరాలకు వెళితే.. పులివెందుల పట్టణంలోని హీరోషోరూం నందు మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న రాజేష్ అనే యువకుడు సోమవారం సాయంత్రం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే మార్గం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. రాజేష్ భయమ్మ తోట నందు నివాసం ఉంటున్నాడు. దారిన వెళ్లే వారు గమనించి ఉరి వేసుకున్న విషయం ఎలీసులకు తెలపడంతో రాజేష్ మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. రాజేష్ ఎందుకు ఉరి వేసుకున్నాడు. వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పీలేరు, మే 6: ఇచ్చిన అప్పు వసూలుకు వెళ్లిన వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో శవమై దొరికిన సంఘటన సోమవారం కేవీపల్లె మండలంలో వెలుగుచూసింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. కేవీపల్లె మండలం తిమ్మాపురం పంచాయతీ పెద్దకమ్మపల్లెకు చెందిన వక్క లగడ్డ పెద్దశ్రీరాములు(85) అదే పంచాయతీ అడవికం పల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు మూడేళ్ల క్రితం రూ.40 వేలు అప్పుగా ఇచ్చాడు. చంద్రశేఖర్ ఎంతకీ తీసుకున్న అప్పు తీర్చకపోవడంతో అతని వద్ద ఎలాగైనా డబ్బులు వసూలు చేసుకుని వస్తానని కుటుంబసభ్యులకు తెలిపి ఆదివారం ఇంటి నుంచి అడవికంపల్లెకు బయలుదేరాడు. చీకటిపడ్డా అతను ఇంటికి రాకపోవ డంతో ఆందోళన చెందిన అతని కొడుకు చిన్నయ్య నా యుడు, మనవడు పవన్ కుమార్ అతని కోసం వెతుక్కుంటూ చంద్రశేఖర్ ఇంటి వద్దకు వెళ్లి విచారించగా, చంద్రశేఖర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు వారిద్దరిపై దౌర్జన్యానికి పాల్పడ్డమే కాకుండా తమ ఇంటి మీదికి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారంటూ కేవీపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన వారు స్వగ్రామానికి తిరిగి వచ్చి పెద్దశ్రీరాములు నడిచి వెళ్లిన మార్గంలో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో చంద్రశేఖర్‌కు చెందిన పొలం వద్ద పెద్దశ్రీరాములు విగతజీవుడిగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కలకడ సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పు అడిగాడన్న ఉక్రోషంతో చంద్రశేఖర్, అతని కుమారులు తమ తాతను హత్య చేశారని మృతుడి మనవడు పవన్ తెలిపారు.

వీఆర్‌కు ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

పోరుమామిళ్ల, మే 6: పోరుమామిళ్లలో ఏఎస్ఐగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డిని కడప వీఆర్‌కు బదిలీ చేసినట్లు జిల్లా ఉన్నతాధికారుల నుంచి స్థానిక పోలీసు స్టేషన్‌కు ఆదేశాలు అందాయి. ఆదివారం పోరుమామిళ్లలోని దేశాయి థియేటరు వెనుక వైపు ఉన్న ప్లాట్ల ప్రాంతంలో వసూల్‌రాజా అనే కరపత్రాలతో కూడిన కథనాలు వెలువడ్డాయి. పలు కేసులకు సంబంధించి ఉన్నతాధికారుల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేశారనే కొందరు ఆకాశ రామన్న కరపత్రాలు కంటబడ్డాయి. అంతేగాక ఈ కరపత్రాల విషయం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆయనను వీఆర్‌కు పంపించారు. ఈ విషయమై సీఐ చిరంజీవిని వివరణ కోరగా, ఏఎస్ఐని వీఆర్‌కు పంపాలని ఆదేశాలు అందాయని కరపత్రాల విషయమై అతనిపై వచ్చిన ఆరోపణలపై ఇంకా విచారణ జరుగుతోందన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

బి.కొత్తకోట, మే 6: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఆలేటిపల్లె వద్ద భారీస్థాయిలో కర్ణాటక మద్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మద్యం నిల్వ ఉన్నట్టు సమాచారం అందడంతో సీఐ సూర్యనారాయణ తమ సిబ్బందితో ఆలేటిపల్లెకు చేరుకొని రైతు చెంద్రాయుడుకి చెందిన వ్యవసాయ పొలంలో వున్న వేరశనగ గడ్డివాము కింది భాగంలో 8 సంచులలో దాచి వుంచిన 38 బాక్సులను కనుగొన్నారు. ఇందులో ఉన్న 90 ఎంఎల్ 3642 టెట్రాప్యాకెట్లును స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.1,45,810గా భావిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఓటుకు రూ.5వేలు ఇచ్చినా.. రాచమల్లును ఓడించండి : షర్మిల



మాట్లాడుతున్న షర్మిల

ప్రొద్దుటూరు టౌన్, మే 6: ఎమ్మెల్యే రాచమల్లు గుట్కా, మట్కా, బెట్టింగ్, భూకబ్జాలతో బాగా సంపాదించాడని.. హత్యలు కూడా చేయిస్తాడని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఘాటుగా విమర్శించారు. ఆయన ఓటుకు రూ.5 వేలు ఇచ్చినా తీసుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ప్రొద్దుటూరు పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి నిందితుడు అని సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసినా ముఖ్యమంత్రి హోదాలో అధికారాన్ని అడ్డుపెట్టి జగన్ కాపాడుతున్నాడని విమర్శించారు. వివేకానందరెడ్డిని గొడ్డలితో కిరాతకంగా నరికి చంపినా న్యాయం జరుగడం లేదన్నారు. ఐదు సంవత్సరాలుగా వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత న్యాయం కోసం ఎక్కని గడప లేదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి హంతకుడిని కాపాడితే న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. హంతకుని చేతిలో మన భవిష్యత్ పెడితే మన భవిష్యత్తు ఎలా ఉంటుందో ప్రజలు ఆలోచించాలన్నారు. వివేకా హత్య కేసులో ఒకవైపు న్యాయం, ధర్మం ఉంటే మరో వైపు హంతకులు, అధికారం ఉన్నాయన్నారు. హంతకులు చట్టసభల్లోకి వెళ్లరాదని, న్యాయాన్ని గెలిపించాలని కోరారు. ఎంపీగా ఉన్న గొడ్డలి అవినాశ్‌రెడ్డి కడప స్టీల్‌ప్లాంట్ కోసం ఒక్కరోజు అయినా పార్లమెంటులో ప్రస్తావించలేదని, సొంత కేసుల కోసమే ఢిల్లీకి వెళుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీఎండీ నజీర్, ఇర్ఫాన్‌బాష, సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డివైడరు ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కానిస్టేబుల్ క్రిష్ణనాయక్

చెన్నూరు, మే 6: మండలంలోని కమలాపురం రోడ్డు రుద్రభారతిపేట ఎదురుగా డివైడర్‌ను ఢీకొని క్రిష్ణనాయక్ అనే కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కమలాపురం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించే ఈయన విధుల అనంతరం ఇంటికి వెళుతుండగా రుద్రభారతిపేట వద్ద రహదారిపై ద్విచక్రవాహనం సోమవారం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో గాయపడ్డ కానిస్టేబుల్‌ను స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



బద్వేలు నియోజకవర్గంలో ఫ్యానుకు ఎదురీతే...

- భూదందాలు, భూకబ్జాలతో వైసీపీకి మైనస్
- బద్వేలులో కూటమి వర్సెస్ వైసీపీ బిగ్ ఫైట్
- సూపర్‌సిక్స్, చేరికలతో దూసుకుపోతున్న కూటమి అభ్యర్థి
- ఓటరులో కనిపిస్తున్న మార్పు

(కడప - ఆంధ్రజ్యోతి): బద్వేలు.. ఈ పేరు వింటే కాలజ్ఞాన కర్త మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వాములు, పొలిటికల్‌గా రాజకీయ కురువృద్ధులు బిజివేముల వీరారెడ్డి, శివరామక్రిష్ణరావు గుర్తుకు వస్తారు. అలాంటి ఆ నియోజకవర్గం అంటేనే ఇప్పుడు భూకబ్జాలకు నిలయంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్ల జగన్ పాలనలో వైసీపీ నేతలు భూకాలకేయులుగా మారి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, ప్రైవేటు ఆస్తులను కొల్లగొట్టేశారు. దాదాపు 2వేల ఎకరాలు భూములు అన్యాక్రాంతమయ్యాయని చెబుతారు. అటు కలసపాడు నుంచి ఇటు అట్లూరు వరకు కాశినాయన, పోరుమామిళ్ల, బికోడూరు, బద్వేలు, గోపవరం ఇలా అన్ని మండలాల్లో వైసీపీ నేతలు భూములు ఆక్రమించేశారు. ఇక బద్వేలు, గోపవరం, పోరుమామిళ్ల మండలాల్లో అయితే ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలాలు కూడా వైసీపీ అండ్ కో లాగేసుకుంది.

జనంలో భయం

బద్వేలు వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సుధనే మళ్లీ పోటీ చేస్తున్నారు. 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో ఈమె గెలుపొందారు. పేరుకే ఎమ్మెల్యే అయినా పెత్తనమంతా ఎమ్మెల్సీ గోవింద రెడ్డిదే. బద్వేలు, గోపవరం మండలాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ గత ప్రభుత్వాలు పేదలు, ప్రభుత్వ ఉద్యోగులకు దశాబ్దాల కిందట ఇంటి పట్టాలు ఇచ్చారు. ఆర్థిక పరిస్థితి కారణంగా కొందరు ఇక్కడ ఇళ్లు కట్టుకోలేదు. అయితే ఆ స్థలాలపై కన్నేసిన ముఖ్యనేతల అనుచరులు వారంతా నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించేశారు. ఎదురు తిరిగితే దాడులు, కేసులు పెట్టి లాగేసుకుంటున్నారు. వైసీపీ అండలేని జనం చిగురుటాకుల్లా వణికిపోయారు. ఓ ఛైర్మన్ అనుచరుడు మరో నేత ముగ్గురూ కలిసి పట్టణంలో స్థలాలు కొట్టేశారని చెబుతారు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, గోపవరం మండలాల్లో ప్రభుత్వ ప్రైవేటు స్థలాలను కబ్జా చేశారు.

నియోజకవర్గంలోని మండలాలు
కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, బికోడూరు, బద్వేలు, గోపవరం, అట్లూరు

మొత్తం ఓట్లు : 2,19,290
పురుషులు : 1,09,163
మహిళలు : 1,10,122
ఇతరులు : 5

ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు సుమారు
రెడ్లు : 55000
మాదిగ : 30000
మాల : 25000
యాదవ : 23000
బలిజ : 25000
వైశ్య : 16000
ముస్లిం : 11000
వడ్డెర : 5000
ముదిరాజ్ : 5000

దూసుకుపోతున్న ఉమ్మడి అభ్యర్థి

పొత్తులో భాగంగా బద్వేలు నుంచి కూటమి అభ్యర్థిగా బొజ్జా రోశన్న బరిలో ఉన్నారు. పేరుకే బీజేపీ అయినప్పటికీ కూటమి బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు రితీష్ కుమార్ రెడ్డి భుజస్కంధాలపై నడిపిస్తున్నారు. బాబు భవిష్యత్తు గ్యారంటీ పేరుతో తొలుత మాజీ ఎమ్మెల్యే విజయమ్మ రితీష్ బొజ్జన్న నియోజకవర్గమంతా చుట్టారు. ఇక రితీష్‌కుమార్ రెడ్డి నియోజకవర్గంలో పాదయాత్ర చేశారు. సూపర్ సిక్స్ పథకాలను జనంలోకి బాగా తీసుకెళ్లారు. గతంలో ఎన్నడూలేని విధంగా వైసీపీ నుంచి పెద్ద ఎత్తున టీడీపీలోకి చేర్చుకున్నారు. బద్వేలులో అడా ఛైర్మన్ సింగసాని గురుమోహన్ సోదరులు సహా పలువురిని టీడీపీలో చేర్చుకున్నారు. గోపవరం, అట్లూరు, బి.కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన నుంచి పెద్ద ఎత్తున వైసీపీ నేతలను సైకిలు గూటికి చేర్చారు. ఇక వైసీపీ చేసిన భూదందాలు, దౌర్జన్యాలు కూటమి అభ్యర్థికి బాగా కలిసి వస్తున్నాయి. మళ్లీ వైసీపీ గెలిస్తే భూములు ఉండవు, స్థలాలు ఉండవనే భయం కలిసి వస్తోంది. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు జనాలకు బాగా కనెక్ట్ అయ్యాయి. టీడీపీ పాలనతో, వైసీపీ పాలనను జనం పోల్చుకుని ఈ అరాచకాలు భరించలేమంటూ కూటమి వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. రితీష్ పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తే ఏమేమి చేస్తారో ఒక డైరీలో రాసుకుని హామీ ఇస్తూ వచ్చారు.



బొజ్జా రోశన్న (బీజేపీ)

బలహీనతలు

బద్వేలులో వీరారెడ్డి బతికున్నంత కాలం టీడీపీకి కంచుకోట. అలాంటిది తరువాత కాంగ్రెస్, వైసీపీ లకు కోటగా మారింది. 2001 లో జరిగిన ఉప ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ గెలుపొందారు. 2004 నుంచి ఇంత వరకు ఒక్కసారి టీడీపీ గెలవలేదు. అయితే ఇప్పుడు కూట మి తరపున బీజేపీ అభ్యర్థిగా బొజ్జా రోశన్న పోటీ చేస్తు న్నారు. అయితే ఇప్పుడు సైకిలు లేదుకాబట్టి ఆ ఓట్లన్నీ కమలం గుర్తుకు పడాలి. ఎంత మేర ఆ ఓట్లు డైవర్ట్ చేస్తారనేది ప్రధానంశం. కొన్ని మండలాల్లో టీడీపీ మండల కమిటీలు బలహీనంగా ఉన్నాయి. ఆది నుంచి టీడీపీలో ఉన్న వారిని కలుపుకోకపోవడం. ఎన్నికలు అయితే విజయమ్మ, రితీష్ అందుబాటులో ఉండరనే అపవాదు ప్రజల్లో నెలకొంది.

వైసీపీకి బలం

ఎమ్మెల్యేగా తిరిగి డాక్టర్ సుధ పోటీ చేసినా మొత్తం అంతా నడిపించేది ఎమ్మెల్సీ గోవిందరెడ్డి. ఆయన రాజకీయాల్లో అడుగు పెట్టినప్పటి నుంచీ పోల్‌మేనేజ్‌మెంటు చేయడంలో సిద్ధహస్తుడు. అధికారంలో ఉండడం ఎంతైనా ఖర్చు చేయడం కలిసి వస్తుంది.

బలహీనతలు

పేరుకే ఎమ్మెల్యే. ఈ ఐదేళ్లలో వైసీపీ నేతలు నియోజక వర్గాన్ని పెద్దఎత్తున ప్రభుత్వ భూములను ఆక్రమించేశారు. ఖాళీ స్థలం ఉన్నవారు భూములు సాగు చేయనివారు భయంగా బతకాల్సి వచ్చింది. దీంతో జనమంతా వ్యతిరేకతతో ఉన్నారు. మళ్లీ వైసీపీ వస్తే ఉన్న ఇళ్లు, ఆస్తులు లాక్కుంటారనే భయం వారిలో ఉంది. ఇక పార్టీలో పెత్తనం కానీ, పదవులు కానీ ప్రధాన పార్టీలోని ఒక సామాజిక వర్గానికే ప్రాధాన్యమిస్తున్నారు. ప్రభు త్వంపై ఉన్న వ్యతిరేకత మళ్లీ వస్తే భూము లు, ఇళ్లు లాక్కుంటారనే భయం జనాల్లో ఉంది. ఇక ఎమ్మె ల్సీ గోవిందరెడ్డి, ఆయన బామ్మర్ది కాశినా యన మాజీ మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి మధ్య వర్గపోరు నడుస్తోంది. రెండు వర్గాలుగా విడిపోయాయి. భూక బ్జాలు ఒక చోటకే పరిమితం కాలేదు. నియోజకవర్గంలో అన్ని చోట్ల భూకబ్జాలు జరగడం, సామాన్య జనాల్లో భయం నెలకొంది. రూ.130 కోట్లతో బద్వేలు పట్టణంలో అభివృద్ధి పనులకు సీఎం శంకు స్థాపన చేసినా నిధుల లేమి కారణంగా పను లు మధ్యలోనే ఆగిపోవ డం, ఇచ్చిన హామీలు నెరవేరక పోవడం, సోమశిల నుంచి నీరు ఇస్తామని చెప్పిన హామీ కూడా నెరవేరకపోవడం.



డాక్టర్ సుధ (వైసీపీ)

తంబళ్లపల్లె నియోజకవర్గంలో మూడు సార్లు ఎన్టీఆర్ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారానికి తంబళ్లపల్లె నియోజకవర్గానికి వచ్చిన ఎన్టీఆర్(ఫైల్)

ములకలచెరువు, మే 6: టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) మూడు సార్లు ఎన్నికల ప్రచారం కోసం తంబళ్లపల్లె నియోజకవర్గానికి వచ్చారు. 1983లో పార్టీ స్థాపించిన తరువాత జరిగిన ఎన్నికల్లో భాగంగా ప్రచారం కోసం మొదటి సారి తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువుకు వచ్చారు. అప్పటి టీడీపీ అభ్యర్థి, ఉమ్మడి చిత్తూరు జిల్లా తొలి పార్టీ అధ్యక్షుడు ఏవీ ఉమాశంకర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ములకలచెరువు బస్టాండు సర్కిల్‌లో ప్రచారథం నుంచి ప్రసంగించారు. 1984లో టీడీపీ తరపున పోటీ చేసిన ఏవీ లక్ష్మీదేవమ్మకు మద్దతుగా ప్రచారం చేసేందుకు తంబళ్లపల్లెకు వచ్చారు. 1994లో ములకలచెరువుకు వచ్చారు. అప్పట్లో హెలీకాప్టర్‌లో వచ్చి స్థానిక జడ్పీ హైస్కూల్‌లో దిగారు. ఏవీ లక్ష్మీదేవమ్మకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ములకలచెరువులోని కదిరి రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అప్పట్లో ఎన్టీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

ఓటరు స్లిప్పు అందలేదా ?



కడప (ఎర్రముక్కపల్లె), మే 6: లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల్లో భాగంగా 13న పోలింగ్ జరగనుంది. పోలింగ్ తేదీ దగ్గరపడుతుండడంతో ఓటర్లకు స్లిప్పుల పంపిణీ ముమ్మరంగా జరుగుతుంది. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు అందించడానికి బూత్‌లెవల్ ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించారు. కానీ చాలా మందికి ఓటరు స్లిప్పులు అందలేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో సంబంధిత బీఎల్‌ఓ ద్వారా పొందే అవకాశం ఉంది.

ఏం చేయాలంటే...

ఓటరు స్లిప్పులు ఎన్నికల సిబ్బంది నుంచి అందకుంటే ఆన్‌లైన్, మొబైల్‌యాప్, హెల్ప్‌లైన్ నంబరు, మొబైల్ ఎస్ఎంఎస్‌ద్వారా పొందడానికి ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. ఒకవేళ ఫిజికల్ లేదా డిజిటల్ ఓటరు స్లిప్పు లేకపోయినా నేరుగా పోలింగ్ బూత్‌కు వెళ్లి చెక్ చేసుకోవచ్చు. అదే పోలింగ్ కేంద్రంలో పేరు ఉంటే గుర్తింపు కార్డు చూపి ఓటు వేయవచ్చు.

ఒక్క మెసేజ్‌తో...

ఓటరు గుర్తింపు కార్డు నెంబరును టైప్ చేసి 19501950 లేదా 92117 28082 నెంబరుకు ఎస్ఎంఎస్ పంపితే వివరాలు వస్తా.యి. ఎటువంటి రుసుం లేకుండానే ఈ నెంబరుకు పంపిన వివరాలను సరిపోల్చుకుని ఎన్నికల సంఘం తగిన సమాచారం పంపుతుంది.

ఆన్‌లైన్‌లో అయితే...

సీఈఓ.ఏపీఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో సెర్చ్‌యువర్‌నేమ్, అసెంబ్లీ, ఓటరు సర్వీసు పోర్టల్ మెనూ ద్వారా ఓటరు గుర్తింపు కార్డు లేదా మొబైల్ నెంబరులేదా పేర్లు ఇవ్వడం ద్వారా ఏ నెంబరు పోలింగ్ కేంద్రంలో ఓటు వేయవచ్చో తెలుసుకోవడంతో పాటు డిజిటల్ స్లిప్పులుడౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఎలక్టోరల్ సెర్చ్ ఈసీఐ గవర్నమెంటు.ఇన్ ద్వారా వివరాలు పొందుపనిరిచి ఓటరు డిజిటల్ స్లిప్పు పొందవచ్చు.

టోల్‌ఫ్రీ నంబరు ద్వారా...

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 24గంటలు పనిచేసే హెల్ప్‌లైన్ (టోల్‌ఫ్రీ)నెంబరు 1950కి ఫోను చేసి ఓటర్ల వివరాలను లేదా ఓటరుకార్డు గుర్తింపు నెంబరు తెలియజేయడం ద్వారా కూడా పోలింగ్ కేంద్రం, బూత్‌నెంబరు తదితర వివరాలు పొందవచ్చు.

మెయిల్ నుంచి

ఎన్నికల సంఘానికి మెయిల్ కంప్లయింట్ రేట్ ఆఫ్ సీసీఐ గవర్నమెంటు ఇన్ ద్వారా కూడా మనగ్రీవెన్స్ ఇచ్చి పోలింగ్ బూత్ వివరాలను తిరిగి మెయిల్ ద్వారా పొందవచ్చు.

మొబైల్ యాప్‌తో...

ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్లు గూగుల్ ప్లే స్టోరు నుంచి ఐఓఎస్‌వినియోగదారులు యాప్ స్టోరు నుంచి ఓటరు హెల్ప్‌లైన్ యాప్ అన్న అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు ఇవ్వాలి. దీని ద్వారా ఏ నెంబరు పోలింగ్‌బూత్‌లో ఓటు వేయవచ్చో తెలుసుకోవచ్చు.

ఇలా కూడా పొందవచ్చు

డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఓటర్స్.ఈసీఐ గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో సెర్చ్‌ఇన్ ఎలక్టోరల్ ఆప్షన్ సెలక్ట్ చేసి వ్యక్తుల వివరాలను పొందుపరచడం ద్వారా కూడా ఎతలుసుకోవచ్చు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఈఓ.ఏపీ.ఎస్ఐపీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఆఫీసర్ డిటైయిల్, బూత్‌లెవల్ ఆఫీసర్ డిటైయిల్ అన్న ఆప్షన్ ద్వారా జిల్లా నియోజకవర్గం అక్కడ పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌ఓల ఫోను నెంబర్లను తెలుసుకుని వారికి ఫోను చేసి బూత్ నెంబరు వివరాలను పొందవచ్చు.



ముప్పేట 'రక్షణ'లో ప్రధాని సభా స్థలం

కలికిరి, మే 6: కలికిరి సమీప నగరిపల్లె దగ్గర బుధవారం జరుగన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన మూడు రక్షణ సంస్థలు వలయంగా ఏర్పడ్డాయి. సభా ప్రాంగణం ఎదురుగా సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాద నిరోధక తీవ్రవాద వ్యతిరేక శిక్షణా సంస్థ (సీఐఏటీ-3) వుంది. దాని పక్కనే సరిహద్దు భద్రతా దళాల (బీఎస్ఎఫ్) 65వ బెటాలియన్ ఏర్పాటైంది. దానికి ఆనుకునే ఇండో టిబెట్ సరిహద్దు భద్రతా పోలీసు 53వ బెటాలియన్ వుంది. ఇక సభా స్థలికి వెనుకవైపు సైనిక్ స్కూల్ వుంది. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ భద్రతా దళాల ప్రాంగణాలన్నీ సభ ఎదురుగానే వుండడంతో ప్రధాని, ఇతర నేతలు కూడా వేదిక మీది నుంచి వీటిని స్పష్టంగా చూసే వీలుంది.

మహల్ కట్టలేదు.. షాదీ జరపలేదు!

- పీలేరు నియోజకవర్గంలో దుస్థితిలో షాదీ మహళ్లు
- పీలేరు పట్టణంలో ప్రారంభం కాని పనులు
- వెక్కిరిస్తున్న శిలాఫలకం..
- హామీలతో ప్రజలను మోసగించిన వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు

పీలేరులో నిర్మాణాలు చేపట్టక ఖాళీగా ఉన్న షాదీ మహల్ స్థలం



పీలేరు/కలకడ/గుర్రంకొండ/వాల్మీకిపురం/కలికిరి, మే 6: 'పీలేరు నియోజకవర్గంలోని మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందులో భాగంగా పీలేరు నియోజకవర్గంలోని షాదీ మహళ్లను ఆధునికీకరిస్తాం. తొలుతగా పీలేరు పట్టణ ముస్లిం కోసం రెండు ఎకరాల విశాల ప్రాంగణంలో రెండు ఫ్లోర్లు, అత్యాధునిక వసతులతో కూడిన షాదీమహల్‌ను నిర్మిస్తాం. ఆ తరువాత నియోజకవర్గంలోని మిగిలిన ప్రాంతాల్లోని షాదీ మహళ్లను అభివృద్ధి చేస్తాం" అంటూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి 2022లో పవిత్ర రంజాన్ మాసం సామూహిక నమాజు సందర్భంగా ప్రకటించారు. దీంతో వారిద్దరూ మాట ఇచ్చినట్లు కొత్త షాదీ మహల్ నిర్మాణం వేగంగా జరుగుతుందని, పేద, మధ్యతరగతి కుటుంబాల వారు అతి తక్కువ ఖర్చుతో వివాహాలు జరిపించుకోవచ్చునని సంబరపడ్డారు. అలా ప్రకటించిన ఏడాది తరువాత మళ్లీ రంజాన్ మాసంలోనే 2023, ఏప్రిల్ 17వ తేదీ వారిద్దరూ ఎంతో ఆర్భాటంగా పీలేరు-తిరుపతి మార్గంలో కొత్త షాదీ మహల్ నిర్మాణానికి శిలాఫలకం కూడా వేశారు. కొత్త షాదీ మహల్ నిర్మాణానికి తన ఎంపీ ల్యాడ్స్‌లో నుంచి నిధులు కేటాయిస్తానని, పనుల పర్యవేక్షణ బాధ్యత ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ)కి అప్పగించామని, రూ.2 కోట్ల అంచనాలతో నూతన భవనం నిర్మిస్తామని శిలాఫలకం ఆవిష్కరణ సభలో వారిద్దరూ ప్రకటించారు. ఆ శిలాఫలకం వేసి ఏడాది దాటింది. ఇంతవరకు అక్కడ ఒక్క ఇటుక కూడా పడలేదు. స్థానిక మదనపల్లె మార్గంలోని ఈద్గా పక్కన ఉన్న పాత షాదీ మహల్‌ను అనాలోచితంగా కూల్చి వేశారని, కూల్చివేత కారణంగా స్థానికుల్లో వ్యతిరేకత రాకూడదన్న తలంపుతో హడావిడిగా కొత్త షాదీ మహల్ ప్రకటన చేశారని, షాదీ మహల్ నిర్మాణానికి వైసీపీ నాయకుల్లో చిత్తశుద్ధి లేదనే ఆరోపణలు పీలేరులో సర్వత్రా వినిపిస్తున్నాయి. కేవలం పీలేరులోనే కాకుండా నియోజకవర్గంలోని కలికిరి, వాల్మీకిపురం, కలకడ పట్టణాల్లోనూ షాదీ మహళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, గుర్రంకొండలో సైతం కొత్త షాదీ మహల్ నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ కేవలం నీటి మూటగానే మిగిలిపోయిందని, ముస్లింలు అధికంగా ఉండే పీలేరు నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన చోట్ల పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చుననే విమర్శలు వినవస్తున్నాయి.

హడావిడిగా పాత షాదీ మహల్ కూల్చివేత

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తొలినాళ్లలో పీలేరు పట్టణ షాదీ మహల్‌ను స్థానిక మదనపల్లె మార్గంలోని ఈద్గా మైదానం పక్కన నిర్మించారు. కేవలం రూ.వేయి నామ మాత్రపు రుసుంతో మండలంలోని ముస్లింలు అందులో వివాహాలు జరుపుకునేవారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా దానిని పెద్దది చేయాలన్న తలంపుతో నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాని అభివృద్ధి కోసం రూ.కోటి నిధులు మంజూరు చేసి 2013 మే 27న శిలాఫలకం వేశారు. ఆ తరువాత ఆయన ముఖ్యమంత్రిగా దిగిపోవడం, ఆ తరువాత వచ్చిన ప్రజాప్రతినిధులు ఆ నిధుల గురించి పట్టించుకోకపోవడంతో అవి వెనక్కు వెళ్లిపోయాయి. ఈలోపు పీలేరు పట్టణంలో జనాభా పెరిగిపోవడంతో ఈద్గా మైదానం సరిపోవడం లేదని, షాదీ మహల్ శిథిలావస్థకు చేరుకుందని, దానిని కూల్చివేసి మరోచోట నిర్మిస్తామని, కూల్చివేతతో ఏర్పడే ఖాళీ స్థలాన్ని ఈద్గాలో కలుపుకోవచ్చునని స్థానిక వైసీపీ నాయకులు 2022లో దానిని కూల్చి వేశారు. ఆ తర్వాత రంజాన్ మాసం సామూహిక నమాజు కోసం పీలేరుకు వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలు కొత్త షాదీ మహల్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. హడావిడిగా షాదీ మహల్ కూల్చివేసిన వైసీపీ నాయకులకు కొత్త షాదీమహల్ నిర్మాణానికి స్థలం కరువైంది. దీంతో పీలేరు-తిరుపతి మార్గంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం స్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలంలో షాదీ మహల్ నిర్మిద్దామని నిర్ణయించారు. అలా 2023, ఏప్రిల్ 17న ఎంపీ, ఎమ్మెల్యేలు ఆ స్థలంలో షాదీ మహల్ నిర్మాణానికి శిలాఫలకం వేశారు.



శిథిలావస్థలో వాల్మీకిపురం షాదీ మహల్

ప్రారంభం కాని పనులు

కొత్త షాదీ మహల్ నిర్మాణానికి రూ.2 కోట్లు వెచ్చిస్తామని గొప్పగా ప్రకటించిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఆ తరువాత వాటి మంజూరు కోసం కృషి చేసిన దాఖలాలు లేవు. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఎంపీ ల్యాడ్స్ ద్వారా తొలి విడతగా రూ.50 లక్షలు మంజూరైతే వాటికి మ్యాచింగ్‌గా పీలేరు గ్రామ పంచాయతీ నుంచి రూ.50 లక్షలు విడుదల చేసేలా ప్రణాళిక రూపొందించారని, అసలే ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న పీలేరు గ్రామ పంచాయతీ నుంచి ఒక్కసారిగా అంత పెద్ద మొత్తం మంజూరు చేయడం సాధ్యం కాని పని అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎంపీ ల్యాడ్స్ నుంచైనా నిధులు మంజూరై ఉంటే అంతో ఇంతో పనులు మొదలయ్యేవని, అవి కూడా రాకపోవడంతో అటువైపు తొంగి చూసేవారు కరువయ్యారు. షాదీ మహల్ కోసం కేటాయించిన స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి స్థానిక నేతలు చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం అక్కడ కేవలం శిలాఫలకం మాత్రం ఉత్సవ విగ్రహంలా నిల్చుని ఉంది.

కలకడలో పేరుకే షాదీ మహల్

కలకడలో ఉన్న షాదీ మహల్ కేవలం పేరుకు మాత్రమే ఉంది. 2002లో కలకడకు చెందిన దాత కేసర్ల వెంకటరత్నం షాదీ మహల్ కోసం 30 సెంట్ల స్థలం వితరణగా ఇవ్వడంతో అందులో షాదీ మహల్ నిర్మించారు. అయితే అందులో పెళ్లిళ్లు జరుపుకోవడానికి వసతులు అనువుగా లేవని గ్రామస్తులు వాపోతున్నారు. హాలు చిన్నదిగా ఉండడంతో కార్యాలు జరపడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో విధి లేక షాదీ మహల్ ముందున్న ఖాళీ స్థలంలో షామియానాలు వేసుకుంటున్నారు. వంటావార్పు ఆరుబయట చేసుకుంటూ తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సమకూర్చుకుంటున్నారు. ఆర్థిక స్తోమత బాగా ఉన్న వారు ఈ అవస్థలు పడలేక తమ శుభకార్యాల కోసం పీలేరు, గుర్రంకొండ, రాయచోటి ప్రాంతాల్లోని ప్రైవేటు ఫంక్షన్ హాళ్లపై ఆధారపడుతున్నారు. ఇక పేద, మధ్యతరగతి వారు తమ ఇళ్ల వద్దనో, ఊళ్లో ఖాళీగా ఉన్న స్థలాలలో పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. ఈ ఇబ్బందులు తొలగించడానికి విశాలమైన స్థలంలో అత్యాధునిక వసతులతో షాదీ మహల్ నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ఎంపీ, ఎమ్మెల్యే అనేక సందర్భాల్లో హామీ ఇచ్చారని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలన ముగిసిపోతున్నా దాని గురించి పట్టించుకోలేదని వాపోతున్నారు.



మోసం గురూ!

గుర్రంకొండలో...

ముస్లిం జనాభా 10 వేలకు పైగా ఉన్న గుర్రంకొండలో ఇప్పటి వరకు షాదీ మహల్ నిర్మాణం జరగలేదు. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాని నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినా స్థలం లేకపోవడంతో నిర్మాణం ప్రారంభం కాలేదు. ఆ తరువాత వచ్చిన ప్రజాప్రతినిధులు దాని గురించి పట్టించుకోకపోవడంతో ఆ నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత షాదీ మహల్ కట్టిస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు పలుమార్లు ప్రకటించినా అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో గుర్రంకొండలోని ముస్లింలు ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను ఆశ్రయిస్తున్నారు.



స్థలం సరిపోక కలకడ షాదీ మహల్‌లో షామియానా వేసుకున్న ప్రజలు



శిథిలావస్థలో వాల్మీకిపురం షాదీ మహల్

వాల్మీకిపురంలో...

వాల్మీకిపురం పట్టణంలోని బైపాస్ రోడ్డులో 20 ఏళ్ల క్రితం షాదీ మహల్ నిర్మించారు. 20 ఏళ్లు గడిచినా షాదీ మహల్‌లో తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో చాలా మంది ప్రైవేటు కల్యాణమండపాల్లో పెళ్లిళ్లు చేసుకుంటున్నారు.

కలికిరిలో...

23 ఏళ్ల క్రితం కలికిరిలో నిర్మించిన షాదీ మహల్ ప్రస్తుత అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. దానిని విస్తరించడానికి స్థలం లేకపోవడంతో మరోచోట కొత్త షాదీ మహల్ నిర్మిస్తామని అధికార పార్టీ నేతలు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం అందులో చిన్న చిన్న ఫంక్షన్లు మాత్రం అరుదుగా జరుగుతున్నాయి.

వైసీపీ అభ్యర్థి రాచమల్లును ఓడించండి : వరద




ఉప్పరపల్లెలో వరదరాజులరెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు, 19వ వార్డు ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు,మే 6 : ఐదేళ్ళ పాలనలో వైసీపీ తీవ్రమైన ప్రజావ్యతిరేకతను కూడగట్టుకుందని టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పరపల్లెలో వైసీపీనుంచి చిలుమూరు వెంకట సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, దస్తగిరిరెడ్డి ఆధ్వర్యంలో 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి.వీరందరికీ వరదరాజులరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ అభ్యర్థి రాచమల్లును ఓడించండి..: ప్రొద్దుటూరులో అరాచకపాలనకు మళ్ళీ పునాదులేసిన వైసీపీఅభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని ఓడించాలని టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం 19 వ వార్డు లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మునీర్, వీఎస్ ముక్తియార్,ఈవీ సుధాకర్‌రెడ్డి,జయలింగారెడ్డి, బాబయ్య , మార్తల లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళల సంక్షేమం..: టీడీపీతోనే మహిళల సంక్షేమం అమలవుతుందని టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణ, కోడలు మీనా పేర్కొన్నారు. 35 వార్డులో దేవాంగపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వరద మనుమరాళ్ళు వసంత, కోమల్, శిల్ప, చమేలీ, నాయకులు ఉట్టి లక్ష్మీనారాయణ,మలికార్జున, సూర్య నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి,చిట్టి ప్రతాప్, పట్టుపోగుల పుల్లయ్య, ఆర్‌సీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రజలు..: ప్రజలు టీడీపీ తోనే వున్నారని టీడీపీ అభ్యర్థి నంద్యాలవరదరాజులరెడ్డి పేర్కొన్నారు.సోమవారం పెద్దశెట్టి పల్లె గ్రామంలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చదిపిరాళ్ళ నారాయణరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బోడెల బాబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



35వ వార్డు ప్రచారంలో పాల్గొన్న వరద కుమార్తెలు, కోడలు, మనుమరాళ్ళు



పెద్దశెట్టిపల్లె ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి, నారాయణరెడ్డి

వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లుపై టీడీపీ చార్జ్ షీటు విడుదల

ప్రొద్దుటూరు ,మే 6 : వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆయన బావమరిది బంగారురెడ్డిల అవినీతి భూదందాలపై టీడీపీనేతలు చార్జ్ షీటు విడుదల చేశారు. సోమవారం టీడీపీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఐదేళ్ళ కాలంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేయని దుర్మార్గపు పనిలేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ప్రొద్దుటూరును అడ్డాగా మార్చారన్నారు. హత్యా రాజకీయాలు సాగించి ప్రొద్దుటూరులో భయానక వాతావరణం సృష్టిం చారన్నారు. వందల వేల కోట్ల అవినీతి అక్రమ సంపాదనతో నేడు మళ్ళీ ఎమ్మెల్యే కావాలని చూస్తున్నాడన్నారు. ప్రజలు ఈ సారి రాచమల్లును ఓడించి ఇంటికి పంపాలన్నారు. వరదరాజులరెడ్డిని గెలిపించి ప్రశాంత ప్రొద్దుటూరును కాపాడుకోవాలన్నారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ఆసం రఘురామిరెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, మహ్మద్ గౌస్, నల్లబోతుల నాగరాజు ఘంటశాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



దోపిడీ దొంగల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం




మైదుకూరు మండలం కేశవాపురం ప్రచారంలో పుట్టా సుధాకర్‌యాదవ్, టీడీపీలో చేరిన బండివారిపల్లె వాసులు

మైదుకూరు రూరల్ మే 6 : రాష్ట్రంలో ఇసుక అమ్ముకున్నారు,భూములు ఆక్రమించుకున్నారు,నకిలీ మద్యంతో ప్రజల ఆరోగ్యాలతో ఆడుకొని రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచేసుకున్నారని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని మిట్టమానుపల్లె పంచాయతీ కేశవాపురంలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దోపిడి దొంగలను తరిమికొడదాం..రాష్ట్రాన్ని కాపాడుకుందాం అని తెలిపారు. రెండు సార్లు ఓడిపోయానని,ఈ సారి గెలిపించాలని గ్రామస్థులను కోరారు.పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: మున్సిపల్ పరిధిలోని బండివారిపల్లె వైసీపీ నాయ కులు రఘు, రవిశంకర్, ఓబులేసు, చంద్రశేఖర్, ఓబులేసు, చంద్రాయుడు తదితరుల తమ అనుచరులు దాదాపు 30 కుటుంబాల వారు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. సోమవారం ఉదయం మైదుకూరులోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్న వారందరూ వైసీపీని వ్యతిరేకించి టీడీపీలో చేరారు. కాగా టీడీపీ నాయకులు సోమవారం మైదుకూరులోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఆకుల క్రిష్ణయ్య, ధనపాల రవి, కూశెట్టి రాయుడు, బీయన్ శ్రీనివాసులు, ధనపాల జగన్, యాపరాల లక్ష్మీనారాయణ, ఐతాబాబు, పసుపుల సుందరం పాల్గొన్నారు.

19వ వార్డులో 50 కుటుంబాలు చేరిక..: మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో బండి రెడ్డయ్య ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన దాదాపు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దువ్వూరు(మైదుకూరు)..: దువ్వూరు మండలం నీలపురం తాండకు చెందిన వైసీపీ నాయకులు శివనాయక్, బద్దె నాయక్, విష్ణునాయక్; రామనాయక్ దాదాపు 20 కుటుంబాల వారు ప్రొద్దుటూరులోని పుట్టా సుధాకర్ యాదవ్ నివాసానికి చేరుకొని పార్టీ కండువా కప్పుకున్నారు.

ఖాజీపేట.: మహిళలను అభివృద్ధి చేయాలనే ధ్యేయంతో చంద్రబాబు మేనిఫెస్టో ప్రవేశపెట్టారని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నందిపాడు గ్రామంలో తాటిగొట్ల సునీల్‌కుమార్‌రెడ్డి, ఎన్.వెంకటేశ్వర్‌రెడ్డి వారి అనుచర వర్గం టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో దాదాపు 50 కుటుంబాలు పార్టీలో చేరారు. అలాగే మండల పరిధిలోని భూమాయపల్లె, సన్నపల్లె, అచ్చనపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందురెడ్డి, పుత్తా వెంకటస్వామి, దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, కిశోర్‌కుమార్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రవి, వాకమల్ల వెంకటరామిరెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటేష్, ఫరూక్, ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, మురళీకృష్ణ, సుంకు సత్యం, లక్ష్మీదేవి, దుగ్గిరెడ్డి సరళ పాల్గొన్నారు.

అచ్చెనపల్లెలో 30 కుటుంబాలు చేరిక..: మండల పరిధిలోని మిడుతూరు పంచాయతీలోని అచ్చెనపల్లె గ్రామంలో వెలిచర్ల భాస్కర్‌రెడ్డి, వెలిచర్ల రాజారెడ్డి, భీమవరం రామక్రిష్ణారెడ్డి, పోలు రమణారెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, పీరయ్య, జయరామిరెడ్డి అనుచరవర్గం మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్, కడప ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి సమక్షంలో దాదాపు 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

బ్రహ్మంగారిమఠం..: మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆదరించాలని సోమవారం బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె, కొండుగారిపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో మండల ఎన్నికల ప్రచార సమన్వయకర్త పుట్టా ఆనంద్‌యాదవ్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి,ముదుమాల పోలిరెడ్డి, శ్రీయపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, యల్లటూరు సాంబశివారెడ్డి తదితరులు పాల్గన్నారు.



మైదుకూరులో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ వర్గీయులు



ఖాజీపేట..పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన నందిపాడు గ్రామస్థులు



బీమఠం..సోమిరెడ్డిపల్లెలో ప్రచారం చేస్తున్న పుట్టా ఆనంద్‌యాదవ్

గాండ్ల, తెలికుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు టౌన్, మే 6: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన గాండ్ల, తెలికుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగమయ్య, ఉపాధ్యక్షుడు జి.సి.పుల్లయ్య తెలిపారు. 10వ తరగతిలో 450 మార్కులు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 850 మార్కులుపైగా సాధించిన గాండ్ల, తెలికుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన పురస్కారాలు అందజేస్తామన్నారు.

అలాగే 1 నుంచి 10వ తరగతి చదివే పేద గాండ్ల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు, పరీక్ష అట్టలు, పెన్నులు అందజేస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు ఆంధ్రకేసరి రోడ్డులోని గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9398674595 నంబరులో సంప్రదించాలని కోరారు.

రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ ప్రశాంతం

జమ్మలమడుగు, మే 6: జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సోమవారం రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి క్యూ కట్టారు. మొత్తం 722 మంది ఓటర్లకుగాను 627 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారని 86.84 శాతం వినియోగించుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే హోం ఓటర్లు నియోజకవర్గంలో 102 మందికిగాను 93 మంది వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారని, 91 శాతం ఓటు వినియోగించుకున్నట్లు తెలిపారు. అయితే రెండో రోజు ఇళ్ల వద్ద యథేచ్ఛగా డబ్బుల పంపిణీ జరిగింది.

మైదుకూరు..: మైదుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఆర్వో చంద్రమోహన్ పర్యవేక్షణలో గట్టి పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికలు జరిగాయి. పోలింగ్‌లో మొత్తం 829 ఓటర్లుండగా 711 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల తీరును టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్, వైసీపీ అభ్యర్థి, రఘురామిరెడ్డి పరిశీలించారు.

ఓటు వేసిన 117 మంది వృద్ధులు..: 80 ఏళ్ళు పైబడివారి ఇళ్ళ వద్దకే అధికారులు వెళ్ళి ఓటు వేయించారు. నియోజకవర్గంలో 80 ఏళ్ళు పైబడిన వారు మొత్తం 126 మంది ఉండగా, 117 మందితో ఓటు వేయించారు.

ఓటు వేయని వారికి నేడు, రేపుపోలింగ్..: పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలో తమ ఓటు హక్కు వినియోగించుకోని వారికి మైదుకూరులోని మున్సిపల్ కార్యాలయంలో 7,8 తేదీలల్లో ఓటు వేయాలని ఆర్వో చంద్రమోహన్ తెలిపారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వలన అన్ని విధాలా మోసపోయా

- నమ్మక ద్రోహం చేసిన ఎమ్మెల్యే : వంగల నాగేంద్రయాదవ్

జమ్మలమడుగు, మే 6: జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తనకు నమ్మించి తీవ్రంగా నష్టం చేశారని, అన్నివిధాలా ఆయన వలన నష్టపోయామని ప్రజలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను నమ్మవద్దని వైసీపీ నాయకుడు వంగల నాగేంద్రయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

సోమవారం మధ్యాహ్నం జమ్మలమడుగులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల్లో జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి నిలబడుకోవడానికి, కనీసం ఉండటానికి స్థానం లేకపోతే కార్యాలయంపరంగా పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ఇవ్వగా తాను ఆయన ఉండటానికి ఇల్లు ఇచ్చానని అన్నారు. ఆయన వచ్చినప్పటి నుంచి తన కుటుంబాన్ని డబ్బుకోసం లేనిపోని ఆశలు చూపి చీల్చారని అన్నారు. కేవలం డబ్బు కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నీచాతి నీచమైన మోసాలు చేస్తారన్నారు. ప్రజలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఎవ్వరూ నమ్మరాదని, తనలాగా నమ్మి మోసపోకూడదని వంగల నాగేంద్రయాదవ్ ఆవేదనతో విలేకరులకు తెలిపారు.

ఎన్నికల ఉల్లంఘన కేసు నమోదు

సీఐ రామాంజులు

ఖాజీపేట, మే 6: మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డిపై ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని కేసు నమోదు చేసినట్లు సీఐ రామాంజులు తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే... గత నెల 20వ తేదీన డీఎల్ స్వగృహం వద్ద జరిగిన సమావేశంలో జగన్‌మోహన్‌రెడ్డిని మన రెడ్డి కులస్థుడని ఓట్లు వేస్తే ఇబ్బంది పడుతామని అలాగే వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డి హంతకుడని, వాళ్లమామ ఒక హంతకుడని చివరికి వారి కుటుంబమే హంతకుల కుటుంబమని రెండు వర్గాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో మాధ్యమాల ద్వారా వీడియో వచ్చిందన్నారు. దీనిని పరిశీలించిన ఆర్వో చంద్రమోహన్ ఎంపీడీవోకు తెలుపడంతో ఎంపీడీవో సుమిత్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 6వ తేదీ సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీడీపీ గెలుపు పేదల జీవితాల్లో మలుపు



ఖాజీపేట మండలం మిడుతూరులో ఎన్నికల ప్రచారంలో భాగంగా భూపేశ్‌రెడ్డి, పక్కన అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్



ప్రొద్దుటూరు మండలంలోని పెద్దశెట్టిపల్లెలో భూపేశ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

- టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): టీడీపీ అభ్యర్థులు గెలిస్తే పేదల జీవితాలు మారుతాయని, అందుకే ప్రతి ఒక్కరూ సైకిలు గుర్తు కమలం గుర్తుకు ఓటు వేయాలని కడప పార్లమెంటు టీడీపీ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి చదిపరాళ్ల భూపేష్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని పెద్దశెట్టిపల్లెలో, మైదుకూరు నియోజక్వవర్గంలోని ఖాజీపేట మండలం మిడుతూరులో అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు విజన్ ఉన్న నేత ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ సృష్టికర్త. ప్రపంచంలో తెలుగువారు ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారంటే అది చంద్రబాబు చొరవనే కారణం. ఆయన దూరదృష్టి కారణంగానే ఈ రోజు హైదరాబాదు దేశానికే ఆర్థిక వనరుగా మారింది. అమరావతిని కూడా దేశ ఆర్థిక రాజదానిగా మార్చాలనుకుంటే జగన్ వచ్చి సర్వనాశనం చేశారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబును సీఎంగా గెలిపించుకుంటేనే రాష్ట్ర పునర్వైభవంతో పాటు పేదలందరికీ సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమ పథకాలతో పేదల జీవితాలే మారిపోతాయి. సంక్షేమంతో పాటు అభివృద్ధి సాగుతుంది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు వస్తాయి. అందరికీ న్యాయం జరగాలంటే కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు సీఎం కావాలి.

హోటల్‌లో అగ్నిప్రమాదం

పోరుమామిళ్ల, మే 6 :మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గాన్విక హోటల్‌కు సంబంధించి వెనుక వైపున ఉన్న గుడిసెలు అగ్నికి ఆహుతై లక్షన్నర ఆస్తి నష్టం వాటిల్లింది. సోమవారం సాయంత్రం గాన్విక హోటల్ వెనక వైపున అగ్ని ప్రమాదం సంభవించి మంటలు చెలరేగడంతో విషయం తెలుసుకున్న అగ్నిమాపక కేంద్రం అధికారులు సంఘటనాస్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. దాదాపు లక్ష 50వేలు నష్టం వాటిల్లిందని హోటల్ యజమాని మనోహర్ వాపోయారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం




బీకోడూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న రితీశ్‌రెడ్డి, లింగారెడ్డి, పోరుమామిళ్ల..తంబాబావివీధిలో విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరుతున్న దృశ్యం

బి.కోడూరు, మే 6 : మండల పరిధిలోని మేకవారిపల్లె గ్రామంలో యువ నాయకుడు రితీష్‌రెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి సమక్షంలో పెద్దిరెడ్డి విజయ నరసింహారెడ్డి, రాజారెడ్డి, రమణారెడ్డి వీరితో పాటు మరో 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. అలాగే ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్నకు కమలంగుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓ.రమణారెడ్డి, రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, దుగ్గిరెడ్డి,శేషారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పవన్, తిరుపతిరెడ్డి, కాసా వెంకటసుబ్బారెడ్డి గోడి భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, క్రిష్ణయ్య, బాలిరెడ్డి, మద్దిరెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో 65 కుటుంబాలు టీడీపీలో చేరాయి. సోమవారం పోరుమామిళ్లలోని తంబాబావివీధిలో టీడీపీ నాయకుడు సీతా వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో లాయం వెంకటేశ్వర్లు అలియాస్ బాబాయి సహా 40 కుటుం బాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే కొరసాటిపల్లెలో వైసీపీ నుంచి 25 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమాల్లో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్,నగిరి భైరవ ప్రసాద్, ఇమాంహుసేన్, సెట్టెం ప్రతాప్, విజయుడు, శివశంకర్‌నాయుడు, మల్లికార్జున, రామసుబ్బారావు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బద్వేలుటౌన్..: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్య మంత్రి అయితేనే అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరికొట్టాలలో వైసీపీని వీడి 20 కుటుంబాలవారు విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపాలెం టీడీపీ నాయకులు పీరయ్య, రవికుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఉప్పలపాటి వెంకటసుబ్బయ్య, కూరాకు సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, అంకయ్య, ప్రభాకర్, వెంకటరమణ, మోహన్, శ్రీను, పుల్లయ్య, శివ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..: కొట్టాలపల్లె,బసనపల్లె,కొండ్రాజుపల్లె గ్రామాల్లో సోమవారం వైసీపీ నుంచి టీడీపీలోకి 45 కుటుంబాలు చేరాయని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి తెలిపారు.ఆమేరకు మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మ సమక్షంలో కొట్టాలపల్లెలో కోడూరు మారారెడ్డి, డి.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో 15 కుటుంబాలను, బసనపల్లెలో వెంకటరెడ్డి, లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో 15 కుబుంబాల వారిని,కొండ్రాజుపల్లెలో గోడే పుల్లారెడ్డి,పి.నారాయణరెడ్డి,కే.నారాయణ ఆధ్వర్యంలో 20 కుటుంబాలవారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి,ఓ.రోహిత్‌రెడ్డి నాగసుబ్బారెడ్డి ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్లూరు..: అట్లూరు మండలంలోని కమలకూరు గ్రామం వద్ద బద్వేలు టీడీపీ యువ నాయకుడు రితీష్‌రెడ్డి, కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బొజ్జ రోశన్న కమలం గుర్తుకు కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి సైకిలు గుర్తుకు ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు.కూటమి నాయకులు ఎం.సూర్యనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, లేవాకు రామక్రిష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పోలిరెడ్డి రెడ్డయ్య, సుదర్శనరావు, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గోపవరం..: గోపవరం మండలంలోని బ్రాహ్మణపల్లె పంచాయతీ అడుసువారిపల్లె గ్రామంలో కాంట్రాక్టరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారిని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మామిడి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కొండయ్య, జడ్పీటీసీ జయరామిరెడ్డి, సుధాకర్‌యాదవ్, శివశంకర్‌రెడ్డి, చిన్నసుబ్బయ్య, పెంచలయ్య, పెద్దసుబ్బయ్య,గురమ్మ,కిట్టయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బద్వేలులో విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు




కాశినాయన..కొట్టాలపల్లెలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయమ్మ



బద్వేలు మండలం అప్పారాజుపేట ప్రచారంలో పాల్గొన్న బొజ్జ రోశన్న

ముమ్మరంగా ప్రధాని మోదీ సభ ఏర్పాట్లు

- హెలికాప్టర్ మొదటి దశ ట్రయల్ రన్ విజయవంతం


సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

కలికిరి, మే 6: కలికిరి సమీపంలోని నగరిపల్లె సీఆర్పీఎఫ్ ప్రధాన ద్వారం ముందు ఈనెల 8వ తేదీ బుధవారం జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. సభా వేదిక నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. అదే విధంగా సభా స్థలికి సమీపంలోనే సైనిక్ స్కూల్ దగ్గర మూడు హెలీప్యాడ్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఒక హెలికాప్టర్ ఎయిర్ ఫోర్స్ సిబ్బందిని దించేందుకు ప్రయత్నించగా, అప్పటికి హెలిప్యాడ్‌ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో సమీపంలోని సైనిక్ స్కూల్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో హెలికాప్టర్‌ను ల్యాండ్ చేశారు. అనంతరం అది అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయింది. మధ్యాహ్నానికి ఒక హెలీప్యాడ్ సిద్ధమైనట్లు సమాచారం పంపడంతో బెంగళూరు నుంచి మరో హెలికాప్టర్ ఇక్కడ ల్యాండ్ అయ్యింది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన హెలికాప్టర్ రెండు గంటల అనంతరం తిరిగి బెంగళూరు వెళ్లిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు టీడీపీ అధినేత నారా చంద్రబాబు, జనసేన నేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఈ సభకు హాజరు కానున్న విషయం తెలిసిందే. మంగళవారం నాటికల్లా హెలీప్యాడ్ ప్రాంతంతోపాటు సభా ప్రాంగణమంతా ఎస్పీజీ, ఎన్ఎస్‌జీల అధీనంలోకి వెళ్లనున్నాయి.


ట్రయల్ రన్ కోసం దిగిన హెలీకాప్టర్

భద్రతా ఏర్పాట్లపై సుదీర్ఘ సమావేశం

ప్రధానమంత్రితో పాటు ఇతరం వీవీఐపీలు హాజరు కానున్న బుధవారం నాటి సభకు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు. రెండు రోజులపాటు ఢిల్లీ నుంచి వచ్చిన ఎస్పీజీ అధికారులు పలు సూచనలు జారీ చేశారు. అవన్నీ ఎంత వరకూ నెరవేరాయన్న అంశాలపై సోమవారం రాత్రి ఏడున్నర వరకూ స్థానిక జేఎన్టీయూ కళాశాలలో పోలీసు అధికారులు సమీక్షించారు. కర్నూలు డీఐజీ విజయారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కడప, సత్యసాయి, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు, అనంతపురం తదితర జిల్లాలకు చెందిన 10 మంది ఎస్పీలు హాజరైనట్లు సమాచారం. వీరితో పాటు పెద్ద సంఖ్యలో అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నట్లు తెలిసింది. అంతేగాకుండా ఇంటిలిజెన్స్, ఎస్‌బీ, స్పెషల్ పోలీసు తదితర విభాగాలకు చెందిన ఎస్పీలు కూడా పాల్గొన్నారు. అన్ని రకాల ఏర్పాట్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని కోణాల నుంచి తీసుకోవలసిన పలు రకాల జాగ్రత్తల గురించి చర్చించినట్లు సమాచారం. మధ్యాహ్నం కలెక్టరు అభిషిక్త్ కిశోర్ ఏర్పాట్లను పరిశీలించారు.

అభివృద్ధి చేసేవారిని గెలిపించండి : ఆది


జమ్మలమడుగులోని మోరగుడిలో ఎన్నికల ప్రచారంలో ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు/ముద్దనూరు/కొండాపురం/ఎర్రగుంట్ల/ మే 6: అభివృద్ధి చేసిన, చేసేవారిని సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని వీధుల్లో రోడ్‌షో నిర్వహించి ఓటు వేయాలని ఆయన కోరారు. జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు, మోరగుడి, పి.బొమ్మేపల్లె, అంబవరం, గ్రామాల్లో రోడ్‌షో, అనంతరం సాయంత్రం గూడెం చెరువు, రాజీవ్‌నగర్ కాలనీ, పొన్నతోట ఆర్అండ్ఆర్ కాలనీ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు వీరంరెడ్డిపేట ఓబుళరెడ్డి, ఇంజేటి గురప్ప, మస్తాన్‌రెడ్డి, బత్తల మునెయ్య, సర్పంచ్ కొండయ్య, చౌడం జొల్లు పాండు, ధనుంజయ, బిర్రు ఫిలిప్, సంతోష్, అంబవరం రామయ్య, అనంతయ్యనాయుడు, తదితర నేతలు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం ఎక్కడ జగన్ : చదిపిరాళ్ల అరుణ

ఎన్నికల సమయంలో ఒక్కఛాన్స్ పేరుతో మద్యపాన నిషేదంపై మాట చెప్పి మడమ తప్పిన సీఎం జగన్‌కు ఓటు అడిగే హక్కులేదని చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ విమర్శించారు. సోమవారం జమ్మలమడుగులోని 13వ వార్డులో మద్యంషాపు వద్ద ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అలాగే నాయీబ్రాహ్మణ సాధికార జిల్లా అధ్యక్షుడు గజ్జెల గోవిందు జమ్మలమడుగులోని బార్బర్ షాపుల వద్దకు వెళ్లి కూటమి నేతలకు మద్దతుగా ప్రచారం చేశారు. అదేవిధంగా సున్నపురాళ్లపల్లె గ్రామంలో ఎన్డీయే కూటమి అభ్యర్థులకు మద్దతుగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి, సీనియర్ నాయకుడు జయసింహారెడ్డి ప్రచారం చేశారు.

ఎన్డీయే ప్రభుత్వంలోనే మహిళా సంక్షేమ ఫలాలు అందుతాయని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణమ్మ పేర్కొన్నారు. ముద్దనూరు టౌన్‌లో సోమవారం రామాంజనేయరెడ్డి సతీమణి రమాదేవితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డిని, టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు నరసింహులు, ఖాదర్‌ఖాన్, అబ్దుల్‌ఖాదర్, రాజు, సురేష్, నాగరాజు సాగర్‌బాబు, సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ దానంబాబు, కుడుముల భాస్కర్‌రెడ్డి, కమలాకర్, దామోదర్, వినోద్, కన్నా బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా మండల పరిధి చింతకుంట గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి బీజేపీలోకి చేరారు. కొత్తపల్లె గ్రామంలో సోమవారం బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి సమక్షంలో ఎన్డీయేలో చేరారు. మోహన్‌రెడ్డి, శివారెడ్డి, రామాంజనేయులు, సుబ్బరాయుడు, రాహుల్, కుళాయప్ప, జయశంకర్, సుబ్బయ్యలతో పాటు దాదాపు 20 కుటుంబాలకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అలాగే చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని కొండాపురం మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ సర్పంచ్ బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలో మండల బీజేపీ ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి సమక్షంలో సోమవారం నాని, ఆది, బాలు, సురేంద్ర, రామదాసు, గిరి ఎన్డీయే కూటమిలో చేరారు.

ఎర్రగుంట్ల మండలంలో సోమవారం ఎర్రగుంట్ల 8వ కౌన్సిల్ వార్డుకు చెందిన దస్తగిరి, బాషా, హుసేన్, శివ, ఆంజనేయులు, అక్బర్ తదితర కుటుంబాలు వై.కోడూరు సర్పంచ్ కే.వాసుదేవరెడ్డి, బీజేపీ నాయకుడు మేకల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సీ.ఆదినారాయణరెడ్డి సమక్షంలో చేరారు.

గాలివాన బీభత్సం

నేలపై విరిగిపడ్డ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ● అంధకారంలో గ్రామాలు


కొండూరు ఎస్సీ కాలనీ వద్ద నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అట్లూరు, మే 6: అట్లూరు మండలంలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సంగా రావడంతో కొండూరు ఎస్సీ కాలనీ, అట్లూరు క్రాస్‌రోడ్డు, చౌటుపల్లె రెడ్డిపల్లె వద్ద 33కేవీ విద్యుత్ స్తంభాలు వైర్లు తెగిపడడంతో అట్లూరు, వరికుంట, ఆకుతోటపల్లె తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా సోమవారం రాత్రికి ఇవ్వలేమని అట్లూరు ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల మధ్యవిరిగిన విద్యుత్‌స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకుసిబ్బందితో మరమ్మత్తులు నిర్వహించి విద్యుత్ సరఫరా చేస్తామని ఆయన తెలిపారు. అట్లూరు పోలీసు స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకలకు గంటల పాటు అంతరాయం కలిగింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


సంఘటనాస్థలిలో మృతదేహం

వల్లూరు, మే 6: మండల పరిధిలోని ఎయిర్‌పోర్టు ఎదురుగా జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతిచెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు.. ఎయిర్‌పోర్టు వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని కడప వైపు నుంచి ఎర్రగుంట్ల వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుని వివరాలకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, అతని వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన


క్రికెట్ సెలక్షన్స్ ఎంపిక జరుగుతున్న దృశ్యం

కడప (స్పోర్ట్స్), మే 6: క్రికెట్ క్రీడ పట్ల మక్కువ గల జిల్లాలోని వివిధ క్రీడాకారుల సీనియర్ అండర్-23, అండర్-19, పురుషుల క్రికెట్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి విశేష స్పందన లభించింది. ఇందులో సీనియర్స్ విభాగంలో 50 మంది క్రీడాకారులకు గాను 32 మంది ఎంపికయ్యారు. అలాగే అండర్-23 విభాగంలో 70 మంది క్రీడాకారులకు గాను 42 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్-19 విభాగంలో సుమారు 120 మందికి గాను 60 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కాగా త్వరలో ప్రాబ్లమ్స్ మ్యాచెస్ గురించి తదుపరి తెలుపుతామని సెలక్టర్లు నజీర్ అహ్మద్, అబ్దుల్ రెహ్మాన్ ఫరూక్, శివప్రసాద్, ఆనంద్ కుమార్‌రెడ్డి, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎం.సాయి పృథ్వీతేజ్, సిరాజుద్దీన్ జోలా, సంజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

వల్లూరు, మే 6: ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి క్షేత్రంలో నిర్వహిస్తున్న కామాక్షి సమేత వైద్యనాథేశ్వర శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా రెండోరోజైన సోమవారం ఉదయం వివిధ పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైద్యనాథేశ్వరున్ని హంస వాహనంపై, చెన్నకేశవున్ని తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు కాయకర్పూరం చెల్లించి తమ మొక్కులు తీర్చుకున్నారు.


గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొండలనూ కొల్లగొట్టారు


వెల్లటూరు పైభాగాన గాలేరు నగరి కాల్వ మట్టిని తరలించిన ప్రదేశం

- గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు
- ఐదేళ్లలో వైసీపీ నేతల దందా

పెండ్లిమర్రి, మే 6: ప్రకృతి వైపరీత్యాలు తుఫాను, సునామిలాంటి వాటితో కూడా ఇలాంటి నష్టం జరిగి ఉండదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రకృతి సహజమైన ఇసుక, మట్టి, గ్రావెల్‌ను కొల్లగొట్టి కోట్లు గడించారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు వైసీపీతో కుమ్మక్కై సహజ వనరులను సర్వనాశనం చేశారు. కంచె చేను మేసినట్లుగా కళ్లెదుటే అక్రమాలు జరుగుతున్న ఆపలేని నిస్సహాయస్థితిలో అధికారులు ఉండిపోయారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు ప్రభుత్వ పనులకు అవసరాలు ఉన్నాయని సాకులు చెబుతూ.. అక్రమ రవాణాదారుల మామూళ్లకు లాలూచీపడి సహకరించారు. ఏమంటే వారంతా మండల వైసీపీ నాయకులని ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరులని అక్రమ దందాకు అడ్డంగా సహకరించారు.

మండల పరిధిలోని పగడాలపల్లె సర్వే నెంబర్ 172, మాచునూరు సర్వేనెంబరు 39, చిన్నదాసరిపల్లె సర్వే నెంబర్ 15, పెద్దదాసరిపల్లె, గంగనపల్లె, కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామాల పరిధిలో వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో గుట్టలను తవ్వి కోట్లు కొల్లగొట్టారు. అలాగే మండల పరిధిలోని చెరువుల్లో మట్టిని కూడా వదల్లేదు. ఇంకా మండల పరిధిలో గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వ పనులు జరిగాయి. కాల్వకు రెండు వైపుల పూడిక తీసిన మట్టిని వైసీపీ నేతలు అక్రమంగా రవాణా చేసి తమ జేబులు నింపుకొన్నారు. కడప నగరం అభివృద్ధి చెందుతూ ఉండడంతో కడప-పులివెందుల ప్రధాన రహదారి వెంబడి... యోగివేమన విశ్వవిద్యాలయం చుట్టూ కుప్పలు తెప్పలుగా వెంచర్లు వెలిశాయి. అలాగే కొప్పర్తి పారిశ్రామిక వాడలో కొన్ని కంపెనీలు వచ్చాయి. వాటి నిర్మాణానికి గ్రావెల్ అవసరం ఉంది. దీన్ని వైసీపీ నేతలు సొమ్ము చేసుకొన్నారు. ప్రభుత్వానికి చేరాల్సిన రాయల్టీ డబ్బులు ఎరవేసి.. ఎమ్మెల్యే సహకారంతో ఇష్టారాజ్యంగా అక్రమ రవాణా చేసి అధికారం ఉండగానే వెనువేసుకున్నారు. కొంతమంది వైసీపీ నేతలు అయితే వంద టిప్పర్లకు అనుమతి తీసుకొని వెయ్యి టిప్పర్ల మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారు.


చిన్నదాసరిపల్లె రెవిన్యూ పరిధిలో అక్రమంగా తవ్విన కొండ

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



మృతి చెందిన రాజేశ్, రాజేశ్ (ఫైల్)

పులివెందుల టౌన్, మే 6: పులివెందుల పట్టణంలోని అంబకపల్లి రోడ్డు నల్లపురెడ్డిపల్లె మార్గంలో రాజేష్ (38) అనే యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందారు. వివరాలకు వెళితే.. పులివెందుల పట్టణంలోని హీరోషోరూం నందు మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న రాజేష్ అనే యువకుడు సోమవారం సాయంత్రం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే మార్గం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. రాజేష్ భయమ్మ తోట నందు నివాసం ఉంటున్నాడు. దారిన వెళ్లే వారు గమనించి ఉరి వేసుకున్న విషయం ఎలీసులకు తెలపడంతో రాజేష్ మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. రాజేష్ ఎందుకు ఉరి వేసుకున్నాడు. వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పీలేరు, మే 6: ఇచ్చిన అప్పు వసూలుకు వెళ్లిన వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో శవమై దొరికిన సంఘటన సోమవారం కేవీపల్లె మండలంలో వెలుగుచూసింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. కేవీపల్లె మండలం తిమ్మాపురం పంచాయతీ పెద్దకమ్మపల్లెకు చెందిన వక్క లగడ్డ పెద్దశ్రీరాములు(85) అదే పంచాయతీ అడవికం పల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు మూడేళ్ల క్రితం రూ.40 వేలు అప్పుగా ఇచ్చాడు. చంద్రశేఖర్ ఎంతకీ తీసుకున్న అప్పు తీర్చకపోవడంతో అతని వద్ద ఎలాగైనా డబ్బులు వసూలు చేసుకుని వస్తానని కుటుంబసభ్యులకు తెలిపి ఆదివారం ఇంటి నుంచి అడవికంపల్లెకు బయలుదేరాడు. చీకటిపడ్డా అతను ఇంటికి రాకపోవ డంతో ఆందోళన చెందిన అతని కొడుకు చిన్నయ్య నా యుడు, మనవడు పవన్ కుమార్ అతని కోసం వెతుక్కుంటూ చంద్రశేఖర్ ఇంటి వద్దకు వెళ్లి విచారించగా, చంద్రశేఖర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు వారిద్దరిపై దౌర్జన్యానికి పాల్పడ్డమే కాకుండా తమ ఇంటి మీదికి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారంటూ కేవీపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన వారు స్వగ్రామానికి తిరిగి వచ్చి పెద్దశ్రీరాములు నడిచి వెళ్లిన మార్గంలో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో చంద్రశేఖర్‌కు చెందిన పొలం వద్ద పెద్దశ్రీరాములు విగతజీవుడిగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కలకడ సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పు అడిగాడన్న ఉక్రోషంతో చంద్రశేఖర్, అతని కుమారులు తమ తాతను హత్య చేశారని మృతుడి మనవడు పవన్ తెలిపారు.

వీఆర్‌కు ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

పోరుమామిళ్ల, మే 6: కడప వీఆర్‌కు పోరుమామిళ్లలో ఏఎస్ఐగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేసినట్లు జిల్లా ఉన్నతాధికారుల నుంచి స్థానిక పోలీసు స్టేషన్‌కు ఆదేశాలు అందాయి. ఆదివారం పోరుమామిళ్లలోని దేశాయి థియేటరు వెనుక వైపు ఉన్న ప్లాట్ల ప్రాంతంలో వసూల్‌రాజా అనే కరపత్రాలతో కూడిన కథనాలు వెలు వడ్డాయి. పలు కేసులకు సంబంధించి ఉన్నతాధికారుల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేశారనే కొందరు ఆకాశ రామన్న కరపత్రాలు కంటబడ్డాయి. అంతేగాక ఈ కరపత్రాల విషయం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆయనను వీఆర్‌కు పంపించారు. ఈ విషయమై సీఐ చిరంజీవిని వివరణ కోరగా, ఏఎస్ఐని వీఆర్‌కు పంపాలని ఆదేశాలు అందాయని కరపత్రాల విషయమై అతనిపై వచ్చిన ఆరోపణలపై ఇంకా విచారణ జరుగుతోందన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

బి.కొత్తకోట, మే 6: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఆలేటిపల్లె వద్ద భారీస్థాయిలో కర్ణాటక మద్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మద్యం నిల్వ ఉన్నట్టు సమాచారం అందడంతో సీఐ సూర్యనారాయణ తమ సిబ్బందితో ఆలేటిపల్లెకు చేరుకొని రైతు చెంగ్రాయుడుకి చెందిన వ్యవసాయ పొలంలో వున్న వేరశనగ గడ్డివాము కింది భాగంలో 8 సంచులలో దాచి వుంచిన 38 బాక్సులను కనుగొన్నారు. ఇందులో ఉన్న 90 ఎంఎల్ 3642 టెట్రాప్యాకెట్లును స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.1,45,810గా భావిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఓటుకు రూ.5వేలు ఇచ్చినా.. రాచమల్లును ఓడించండి : షర్మిల


మాట్లాడుతున్న షర్మిల

ప్రొద్దుటూరు టౌన్, మే 6: ఎమ్మెల్యే రాచమల్లు గుట్కా, మట్కా, బెట్టింగ్, భూకబ్జాలతో బాగా సంపాదించాడని.. హత్యలు కూడా చేయిస్తాడని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఘాటుగా విమర్శించారు. ఆయన ఓటుకు రూ.5 వేలు ఇచ్చినా తీసుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ప్రొద్దుటూరు పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి నిందితుడు అని సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసినా ముఖ్యమంత్రి హోదాలో అధికారాన్ని అడ్డుపెట్టి జగన్ కాపాడుతున్నాడని విమర్శించారు. వివేకానందరెడ్డిని గొడ్డలితో కిరాతకంగా నరికి చంపినా న్యాయం జరుగడం లేదన్నారు. ఐదు సంవత్సరాలుగా వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత న్యాయం కోసం ఎక్కని గడప లేదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి హంతకుడిని కాపాడితే న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. హంతకుని చేతిలో మన భవిష్యత్ పెడితే మన భవిష్యత్తు ఎలా ఉంటుందో ప్రజలు ఆలోచించాలన్నారు. వివేకా హత్య కేసులో ఒకవైపు న్యాయం, ధర్మం ఉంటే మరో వైపు హంతకులు, అధికారం ఉన్నాయన్నారు. హంతకులు చట్టసభల్లోకి వెళ్లరాదని, న్యాయాన్ని గెలిపించాలని కోరారు. ఎంపీగా ఉన్న గొడ్డలి అవినాశ్‌రెడ్డి కడప స్టీల్‌ప్లాంట్ కోసం ఒక్కరోజు అయినా పార్లమెంటులో ప్రస్తావించలేదని, సొంత కేసుల కోసమే ఢిల్లీకి వెళుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీఎండీ నజీర్, ఇర్ఫాన్‌బాషా, సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కానిస్టేబుల్ క్రిష్ణనాయక్

చెన్నూరు, మే 6: మండలంలోని కమలాపురం రోడ్డు రుద్రభారతిపేట ఎదురుగా డివైడర్‌ను ఢీకొని క్రిష్ణనాయక్ అనే కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కమలాపురం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించే ఈయన విధుల అనంతరం ఇంటికి వెళుతుండగా రుద్రభారతిపేట వద్ద రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో గాయపడ్డ ఆ కానిస్టేబుల్‌ను స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.